

నెత్తుట మునిగిన పట్టుచీర

రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి

వచ్చే నెలలో ఊరి జాతర ఉంది. జాతరంటే మాటలా..? ఎంత పని ఉంటుంది.! బంధుమిత్రుల్ని పిలవాలి. ఆడ బిడ్డలు వస్తే చీరలు పెట్టాలి. అమ్మోరికి పొట్టేలు కొట్టి.. అందరికీ భోజనం పెట్టాలి. ఒక్కొక్క పని ఇప్పటి నుంచి చేస్తేగానీ అప్పటికి పూర్తి కాదు. ముందుగా పట్టు చీరలు కొందామని అనుకుంది సుమలత. యాడికిలో అయితే మగ్గాలపై నేసిన తాజా పట్టుచీరలు.. కాస్త తక్కువ ధరకు దొరుకుతాయి. అందుకే భర్త రాజశేఖర్‌తో కలిసి బైక్ మీద బయలుదేరింది. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం చెన్నంపల్లి వారి సొంతూరు. ఉదయమే బయలుదేరి.. యాడికిలో కావాల్సిన పట్టు చీరలను కొన్నారు. ఇంటి దగ్గర కొడుకు, కూతురును వదిలిపెట్టి వచ్చారు. వాళ్లు ఎదురుచూస్తుంటారు. అందుకే వచ్చిన పని పూర్తి కాగానే బైక్ మీద తిరుగుపయనమయ్యారు. దారి మధ్యలో మృత్యువు వారిని బలంగా ఢీకొట్టింది. వేడుకలలో కానుకలు కావాల్సిన పట్టు చీరలు నెత్తుట మునిగాయి. ఘోరం జరిగిపోయింది.!

పెద్దవడుగూరు మండలం కిష్టిపాడు సమీపంలో శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో రాజశేఖర్ చౌదరి (28), సుమలత (25) దంపతులు ప్రాణాలు కోల్పోయారు. వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని గుత్తి వైపు నుంచి వస్తున్న బొలెరో వేగంగా ఢీకొట్టింది. డ్రైవర్ మద్యం మత్తే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించుకున్నారు. బొలెరో దూసుకువచ్చి ఢీకొట్టడంతో బైకు తుక్కు తుక్కు అయింది. దంపతులిద్దరూ ఎగిరి రోడ్డుపక్కన దూరంగా పడ్డారు. అప్పటికీ ప్రమాదం తప్పలేదు. కిందపడ్డవారిపై బొలెరో దూసుకుపోయింది. దీంతో వారు అక్కడికక్కడే మృతిచెందారు. ప్రమాద స్థలం భీతావహంగా మారింది. యాడికి పట్టణానికి చెందిన బొలెరో డ్రైవర్ సాయి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో పోలీసులు గుత్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద స్థలాన్ని పెద్దవడుగూరు ఎస్ఐ ఆంజనేయులు సందర్శించారు. మృతదేహాలను గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజశేఖర్ చౌదరి తండ్రి శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, పెద్దవడుగూరు



రాజశేఖర్‌చౌదరి, సుమలత దంపతులు(ఫైల్)



రోడ్డు పక్కన ముళ్లపొదల్లోకి దూసుకెళ్లిన జీపు

నేడు ముత్యాల ముగ్గుల పోటీలు

అనంతపురం కల్చరల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో శనివారం ముత్యాల ముగ్గుల పోటీలు జరగనున్నాయి. ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్ సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్)లో పాల్గొనేందుకు మహిళలు సిద్ధమయ్యారు. ముగ్గుల పోటీలు శనివారం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయి. అనంతపురం అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. న్యాయ నిర్ణేతలు విజేతలను ఎంపిక చేస్తారు. విజేతలకు జేఎల్ మురళీధర్ బహుమతులను ప్రదానం చేస్తారు.

శేషాద్రి కేసును సీఐడీకి ఇవ్వాలి

డీఐజీకి న్యాయవాదుల వినతి



డీఐజీని కలిసిన బార్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాదులు

అనంతపురం క్రైం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సీనియర్ న్యాయవాది శేషాద్రి మృతి కేసును సీఐడీకి అప్పగించాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. అనంతపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. కోర్టు వద్ద నుంచి క్లాక్ టవర్ మీదుగా డీఐజీ కార్యాలయం వరకు వెళ్లారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్ తదితరులు డీఐజీ షిమోషికి వినతిపత్రం అందజేశారు. శేషాద్రి మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లోని సీఐ చాంబర్‌లో ఏం జరిగిందో తేల్చాలని కోరారు. సీఐ శాంతిలాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. శేషాద్రి మృతదేహానికి పోస్టుమార్టం చేయకుండా, ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా అలసత్వం చేశారని డీఐజీకి వివరించారు. పోలీస్‌స్టేషన్‌లో మృతి చెందారనే అంశాన్ని చేర్చకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా ఒత్తిడి తెచ్చారని అన్నారు. సీఐతో పాటు శేషాద్రిపై చేయి చేసుకుని, దుర్భాషలాడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సీనియర్ న్యాయవాది విశ్వనాథరెడ్డి, విటల్, రాజారెడ్డి, గోవిందరాజులు, మంజుల, భాగ్యలక్ష్మి, శ్రీవాణి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. మరికొన్ని రోజుల పాటు విధులను బహిష్కరిస్తామని న్యాయవాదులు తెలిపారు.

టమోటా ధర పతనం



బసంపల్లిలో పొలంలోనే వదిలేసిన టమోటా పంట

12 కిలోల బాక్సు రూ.70

మదనపల్లి.. బళ్లారిలోనూ అంతే

తీవ్రంగా నష్టపోతున్న జిల్లా రైతాంగం

రాయదుర్గం రూరల్/శెట్టూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు నెల రోజులుగా పడిపోతున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పెట్టుబడుల సంగతి అటుంచితే.. ప్రస్తుత ధరలకు కోత కూలీల ఖర్చులు కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల పరిధిలో వేలాది ఎకరాలలో టమోటాను సాగు చేశారు. పంట దిగుబడులను కళ్యాణదుర్గం, అనంతపురం, మదనపల్లి, బళ్లారి మార్కెట్‌లకు తరలించి అమ్ముతుంటారు. కానీ ఎక్కడా గిట్టుబాటు ధర లభించడంలేదు. నెల క్రితం 12 కిలోల బాక్సు రూ.800 పలికింది. ప్రస్తుతం రూ.30 నుంచి రూ.70 మాత్రమే ఇస్తున్నారు. రాయదుర్గం మండలంలో 280 హెక్టార్లలో టమోటాను సాగుచేశారు. ఎకరానికి రూ.లక్ష వరకూ పెట్టుబడి పెట్టారు. దిగుబడి వచ్చే సమయానికి ధరలు పడిపోయాయి. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. కొంతమంది పొలాల్లోనే వదిలేశారు. మరికొందరు పశువులకు విడిచిపెట్టారు.

డిమాండ్ తగ్గినందుకే..

అనంతపురం సమీపంలోని కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శుక్రవారం కిలో కనిష్ఠ ధర రూ.5 పలికింది. గరిష్ఠంగా రూ.10 పలికింది. ఈ ధర స్థిరంగా ఉండటం లేదు. ఒక్కోసారి కిలో రూపాయ మాత్రమే పలుకుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలీలు, రవాణా ఖర్చులు గిట్టడం లేదని అంటున్నారు. హైదరాబాద్ మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడంతోనే స్థానికంగా వ్యాపారులు ధర తగ్గిస్తున్నారు. దీనికితోడు పత్తికొండ మార్కెట్‌లో హైదరాబాద్ టమోటా వస్తోందని, దీంతో ఇక్కడి టమోటాకు ధర లభించడం లేదని మార్కెట్ వర్గాలు అంటున్నాయి.



కూలి ఖర్చులు కూడా రాలేదు..

మూడెకరాలలో టమోటా పంటను సాగుచేశాను. ఈ ఏడాది మంచి ధర లభిస్తుందని నమ్మకంతో ఎకరానికి రూ.లక్షల వర కూ పెట్టుబడి పెట్టాను. దిగుబడి బాగా వచ్చింది. కానీ ధర అమాంతం పడిపోయింది. కూలీల ఖర్చులు కూడా రావడంలేదు.

- హనుమంతు, రైతు, నాగిరెడ్డిపల్లి

రూ.3 లక్షలు పెడితే..

మూడెకరాలలో టమోటా పంట సాగుకు రూ.3 లక్షలు ఖర్చు పెట్టాను. దిగుబడి అమ్మితే రూ.47 వేలు మాత్రమే చేతికొచ్చింది. ధర పడిపోవడంతో తీవ్రంగా నష్టపోయాను. అధునాతన పద్ధతిలో పంటను సాగుకు లక్షలాది రూపాయలు ఖర్చవుతున్నాయి. కానీ ధరలు స్థిరంగా ఉండటం లేదు. పంట చేతికి వచ్చేలోగా ధరలు పడిపోతున్నాయి. మార్కెట్‌కు టమోటాను తీసుకెళ్తే నో సేల్ అంటున్నారు.

- మనోహర్‌నాయుడు, రైతు, కాశీపురం



ప్రతి పనిని యాప్‌లో నమోదు చేయండి

డీపీఓ నాగరాజనాయుడు

అనంతపురం న్యూటౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రతి రోజు పంచాయతీల్లో చేపట్టే పనులను పీఆర్-1 యాప్‌లో నమోదు చేయాలని పంచాయతీ కార్యదర్శులు, ఈఓఆర్డీలను డీపీఓ నాగరాజనాయుడు ఆదేశించారు. సిబ్బందితో ఆయన శుక్రవారం జూమ్ సమీక్ష నిర్వహించారు. చెత్త సేకరణ, క్లోరినేషన్ సహా ఏ పనులు చేసినా యాప్‌లో అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. పంచాయతీల్లో సేకరించిన చెత్త నుంచి ప్లాస్టిక్ ఇతర మెటీరియల్‌ను ప్రతి గురువారం వేరు చేయాలని సూచించారు. వాటిని విక్రయించి, వచ్చిన సొమ్మును పంచాయతీ ఖాతాల్లో జమ చేయాలని ఆదేశించారు. జనవరి ఆఖరులోపు ఇంటి పన్ను వసూళ్లు వందశాతం పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు.. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చెరి సగం పంచుకుందాం..!

ఓ అధికారికి వైసీపీ నాయకుడి ఆఫర్

అగ్రిగోల్డ్ భూముల వ్యవహారంలో బేరం



అగ్రిగోల్డ్ భూముల ముఖద్వారం

పుట్లూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ భూముల్లో వచ్చే ఆదాయాన్ని ఏటా చెరి సగం పంచుకుందామని విజయవాడలోని ఓ అధికారికి వైసీపీ నాయకుడు బంపర్ ఆఫర్ ఇచ్చినట్లు తెలిసింది. పుట్లూరు మండలంలోని కడవకల్లు, చెర్లోపల్లి గ్రామాల మధ్య సుమారు 217 ఎకరాల అగ్రిగోల్డ్ భూములు ఉన్నాయి. ఇందులో సుమారు వంద ఎకరాలను స్థానిక వైసీపీ నాయకుడు అక్రమంగా సాగు చేసుకుంటున్నాడు. ఈ వ్యవహారాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. దీంతో ఆయన బేరసారాలకు దిగినట్లు తెలిసింది. 'సార్... పేపర్‌లో ఎలాగూ వచ్చింది. ఇంకేమి అవుతుంది? ఉన్న భూముల్లో వచ్చే ఏడాది భారీగా పెట్టుబడులు పెడతాను. వచ్చే ఆదాయంలో చెరి సగం పంచుకుందాం..' అని ఓ అధికారికి ఆఫర్ ఇచ్చినట్లు తెలిసింది. విజయవాడకు చెందిన ఆ అధికారికి ఇచ్చిన ఆఫర్ స్థానికంగా హాట్ టాపిక్ అయ్యింది.

అడుగు పెడితే వదిలేది లేదు..

సీజ్ చేసిన అగ్రిగోల్డ్ భూముల్లో ఎవరైనా అడుగుపెడితే సహించేదిలేదని ఆ వైసీపీ నాయకుడు కొందరికి గట్టిగానే వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసింది. గత నెలలో రాష్ట్రస్థాయి వామ పక్షనాయకులు ఆ భూముల పరిశీలనకు వచ్చారు. ఆ తరువాత మరికొందరు అక్కడికి వెళ్లారు. అగ్రిగోల్డ్ భూముల్లో ఎలాంటి పరికరాలు ఉన్నాయి, ఏ పంటలు సాగు చేశారో చూసేందుకు ప్రయత్నించారు. దీంతో వారిపై వైసీపీ నాయకుడు చిందులు వేసినట్లు సమాచారం. 'ఇక్కడ మేము కాపలాగా ఉన్నాం. మాకు జీతాలు ఇవ్వలేదు. అందుకే ఈ భూములను సాగు చేసుకుంటున్నాం. ఎవరి అనుమతి తీసుకొని మీరు ఇక్కడికి వచ్చారు..?' అని దబాయించినట్లు తెలిసింది. అగ్రిగోల్డ్ భూములను ఆక్రమించినా, సీజ్ చేసిన భూములను జిల్లా అధికారులు పరిశీలించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్యం అందాలి

వైద్యఆరోగ్యశాఖ సమీక్షలో కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టరు వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): వన్ హాస్పిటల్ వన్ విలేజ్‌లో ప్రతిఒక్కరికీ ఉచితంగా వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకుసాగాలని వైద్యాధికారులను జిల్లా కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆయుష్మాన్‌భారత్‌పై శుక్రవారం ఆయన సమీక్షించారు. కలెక్టరు మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన కింద 6,76,813మందిని ఎన్‌రోల్ చేయాల్సి ఉందన్నారు. ఇప్పటికి 6, 27,041మందిని నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఏఎన్ఎంల ద్వారా వంద శాతం పూర్తి చేయించాలన్నారు. అసిస్టెంట్ కలెక్టరుతో సమన్వయం చేసుకొని మండలాల సిబ్బందితో వీడియోకాన్ఫరెన్స్‌లు, సమావేశాలు పెట్టుకొని లక్ష్యం పూర్తి చేయాలన్నారు. ఆయుష్మాన్ భారత్‌కార్డుకు సంబంధించి ప్రత్యేకంగా ఎన్‌రోల్‌మెంట్ చేయడం వల్ల దేశవ్యాప్తంగా ఉచిత వైద్యసేవలు పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవల గ్రీవెన్స్‌కమిటీని నాలుగునెలలకు ఓసారి నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వన్ హాస్పిటల్ వన్‌విలేజ్‌లో ఫ్రీహెల్త్ చెకప్ చేసేవిధంగా చూడాలన్నారు. జిల్లాలోని ఆస్పత్రులలో ఎన్టీఆర్ వైద్యసేవలో జరిగే ప్రసవాల వివరాలను విధిగా నమోదు చేయాలన్నారు. ఎన్టీఆర్ వైద్యఆరోగ్యశ్రీ సేవల ద్వారా వచ్చే పారితోషికం నిధులతో ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టరు వినూత్న, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టరు కిరణ్‌కుమార్‌రెడ్డి, డీసీహెచ్ఎస్ డాక్టరు రవికుమార్, డీపీఎం డాక్టరు రవిశంకర్, డెమో త్యాగరాజు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఉచిత బస్సు ప్రయాణంపై అధ్యయనం

ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు



కర్ణాటక ఆర్టీసీ వైస్ చైర్మన్ మొహ్మద్ రిజ్వాన్ నవాబ్‌ను కలిసి పుస్తకాన్ని బహుకరిస్తున్న నాగరాజు

అనంతపురం కల్చరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలో అమలవుతున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై రాష్ట్ర ప్రభుత్వం అధ్యయనం చేస్తోందని ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు పేర్కొన్నారు. త్వరలోనే ఇక్కడ కూడా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్నారు. కర్ణాటక రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డితోపాటు అక్కడి ఆర్టీసీ అధికారులను ఏపీ రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్ నేతృత్వంలోని రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం శుక్రవారం కలిసి అధ్యయనం చేసింది. ఈ బృందంలో నాగరాజు కూడా ఉన్నాడు. రాష్ట్ర ప్రభుత్వంతో మరోసారి చర్చలు జరిపి ఉచిత బస్సు ప్రయాణంపై తుదినిర్ణయం తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

తాడిపత్రికి ఎయిర్‌పోర్టు

పరిశీలించాలని అధికారులకు సీఎం సూచన

అనంతపురం జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తాడిపత్రిలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు నిర్మాణానికి అవకాశం ఉందని, పరిశీలించాలని సీఎం చంద్రబాబు కేంద్ర విమానయాన శాఖమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ఉన్నతాధికారులకు సూచించారు. పెరుగుతున్న అవసరాల నేపథ్యంలో కొత్తగా ఎయిర్‌పోర్టులు ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటోంది. ఈక్రమంలోనే శుక్రవారం కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉండవల్లిలోని తన నివాసంలో ఎయిర్‌పోర్టులపై సమీక్షించారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతంగా తాడిపత్రిని గుర్తించిన నేపథ్యంలోనే ముఖ్యమంత్రి తాడిపత్రిలో ఎయిర్‌పోర్టు నిర్మాణం చేయాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

జాతీయ చెస్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా సామర్లకోటలో ఈనెల 17 నుంచి నిర్వహించే జాతీయ చెస్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల కర్నూలులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన జిల్లా క్రీడాకారులు సుకృత, రిషిక, మనస్వి మల్లిక, సాయి మనోజ్ కృష్ణలు జాతీయ పోటీలకు అర్హత సాధించారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా చెస్‌కోచ్ రవి అభినందించారు.



జాతీయ పోటీలకు ఎంపికైన జిల్లా చెస్ క్రీడాకారులతో కోచ్ రవి

సాగు...బాగు..!

హంద్రీనీవా, జీబీసీకి పుష్కలంగా నీరు



2023లో జీబీసీకి సాగు నీరు లేక ఎండి పోయిన ప్రధాన కాలువ



హంద్రీనీవా కాలువ కింద ప్రస్తుతం కళకళలాడుతున్న మిరప పంట



ఈ ఏడాది జీబీసీ ప్రధాన కాలువలలో పుష్కలంగా ప్రవహిస్తున్న సాగునీరు

- పంటలతో కళకళలాడుతున్న ఆయకట్టు
- వైసీపీ పాలనలో నవంబరుకే బంద్
- ఫిబ్రవరి దాకా వస్తే గట్టెక్కుతామంటున్న రైతులు

విడపనకల్లు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం హంద్రీనీవా, జీబీసీల్లో పుష్కలంగా నీరు ప్రవహిస్తోంది. దీంతో ఆయకట్టు భూములు పంటలతో కళకళలాడుతున్నాయి. వివిధ రకాల పంటలు సాగు చేసిన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ పాలనలో 2023 నవంబరుకే జీబీసీకి సాగు నీరు బంద్ చేశారు. దీంతో రైతులు ఆగ్రహంతో రోడ్డెక్కి ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. జనవరి 2024వరకు పోరాటాలు చేసినా అప్పటి ప్రభుత్వం హంద్రీనీవా నుంచి జీబీసీకి చుక్కనీరు కూడా ఇవ్వలేదు. దీంతో మిరప సాగు చేసిన రైతులు పంటను వదిలేశారు. కొందరు రైతులు ట్రాక్టర్ల ద్వారా పంటకు నీరు అందించారు. మరి కొంత మంది బిందెలతోను బక్కెట్లతోను మొక్కలకు నీరు పోసి కాపాడుకున్నారు. అయినా అత్యధిక మంది రైతులు లక్షల్లో పెట్టుబడులు నష్టపోయారు.

9వ కాలువలో నిండుగా నీరు

గడేకల్లు 9వ కాలువకు గత ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం చుక్క నీరు ఇవ్వలేక పోయింది. జీబీసీ ప్రధాన కాలువకు సాగు నీరు వస్తున్నా 9వ కాలువకు సాగునీరు రాక పోవటంతో ఆ కాలువ కింద ఉన్న నాలుగు వేల ఎకరాలు బీడు భూములుగా మారాయి. ప్రస్తుతం 9వ కాలువకు నిండుగా సాగు నీరు వస్తుండటంతో ఆ కాలువ కింద భూములు ఉన్న రైతులు మిరప, కంది, వరి, జొన్న పంటలు సాగు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 9వ కాలువలో పూడికతీత పనులను చేయించారు. దీంతో సాగు నీరు నిండుగా ప్రవహిస్తోంది.

జీబీసీలో 300 క్యూసెక్కుల నీరు

జీబీసీ ప్రధాన కాలువలో ప్రస్తుతం 300 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. పిల్ల కాలువలకు కూడా నీరు సమృద్ధిగా వస్తోంది. దీంతో పొలాల్లోని చిన్న పిల్ల కాలువలకు కూడా నీరు బాగా వస్తోంది. ఒకే సారిఎన్ని సాళ్లకు వదిలినా నీరు పంటకు సరిపడుతోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సారి సాగు నీరు ఫిబ్రవరి ఆఖరు వారకు వస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం హంద్రీనీవా, జీబీసీ కాలువలకు పూర్తి స్థాయిలో సాగు నీరు వస్తుండటంతో నియోజకవర్గంలోని భూములన్ని పంటలతో కళకళలాడుతున్నాయి. గత ఏడాది సాగు నీరు లేక ఎక్కడ చూసినా ఎండుతున్న పంటలే కనిపించేవి.

పుష్కలంగా నీరు



2023లో నవంబరు నెలలోనే నీరు ఆపేయడంతో సాగు చేసిన మిరప పంటను దున్నేశాము. ఎకరాకు రెండు క్విం టాళ్ల దిగుబడి కూడా రాలేదు. కనీసం ఒక్క తడికి నీరు ఇవ్వండి అని అడిగితే వైసీపీ నాయకులు పట్టించుకోలేదు. ప్రస్తుతం సాగు నీరు కాలువల్లో నిండుగా ప్రవహిస్తోంది. మిరప రైతులకు ఇబ్బంది లేకుండా నీళ్లు వస్తున్నాయి.

\- హనుమంతు, మిరప రైతు, కరకముక్కల

బిందెలతో నీటిని పోశాం



నేను 2023లో హంద్రీనీవా పిల్ల కాలువ కింది 8 ఎకరాల్లో మిరప పంటను సాగు చేశా. అయితే సాగు నీరు నవంబరు నెలలోనే బంద్ చేశారు. దీంతో ట్రాక్టర్ల ద్వారా పంటకు నీటి తడులు ఇచ్చా. అయినా పంట దిగుబడి సరిగా రాలేదు. దాదాపు రూ. 10లక్షలు నష్టం వచ్చింది. ఈ ఏడాది హంద్రీనీవాలోను, జీబీసీలోను సాగు నీరు పుష్కలంగా ప్రవహిస్తోంది. అందుకే ఇప్పుడు కూడా హంద్రీనీవా కాలువ కింద మళ్లీ 8 ఎకరాల్లో పప్పుశనగ సాగు చేశా. పంట కూడా ఆశాజనకంగానే ఉంది.

\- బొజ్జప్ప, మిరప రైతు, చీకలగురికి



2023లో సాగునీరు రాక ట్యాంకర్ల ద్వారా తడి ఇస్తున్న రైతులు

మొక్క జొన్న సాగు చేశా



జీబీసీకి సాగునీరు రాకపోవడంతో 2023లో ట్యాంకర్ల ద్వారా మిరప పంటకు తడులు అందించాం. అయినా దిగుబడులు రాక తీవ్రంగ నష్టపోయాం. ప్రస్తుతం జీబీసీకి సాగు నీరు పుష్కలంగా వస్తోంది. అందుకే పది ఎకరాల్లో మొక్క జొన్న సాగు చేశా. ఫిబ్రవరి చివరి వరకూ సాగు నీరు వస్తే మంచి దిగుబడి వచ్చి, ధరలు కూడా బాగా ఉండే అవకాశం ఉంది. దీంతో గత ఏడాది జరిగిన నష్టాన్ని కొంతైనా పూడ్చుకునే అవకాశం ఉంది.

\- పవన్‌కుమార్, ఆర్ కొట్టాల

ఎస్ఎస్‌బీఎన్ సేవలు ఆదర్శప్రాయం

80వ వసంతోత్సవాలలో వక్తలు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

అనంతపురం సెంట్రల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్‌బీఎన్ విద్యాసంస్థలు భావితరాల విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తాయని పూర్వ, ప్రస్తుత ఉపాధ్యాయులు అన్నారు. ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ఆవరణంలో విద్యాసంస్థల 80వ వసంతోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రమేష్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు. ముందుగా విద్యాసంస్థల ఫౌండర్ సిరివరం ఆదినారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎస్ఎస్‌బీఎన్ విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులు దేశ నలుమూలల ఉన్నత స్థానంలో స్థిరపడ్డారని వక్తలు అన్నారు. ఈ విద్యాసంస్థకు సిరివరం ఆదినారాయణ బీజం వేశారని, ఆయన సేవలు ఎనలేనివని అన్నారు. ఆయన నాటిన మొక్క మహావృక్షమై ఎంతో మంది పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తోందని అన్నారు. ఎంతో మంది ఉపాధ్యాయులకు ఉపాధిని కల్పిస్తోందని అన్నారు. వసంతోత్సవాలను నిర్వహించడం, పూర్వ విద్యార్థులు హాజరై విజయవంతం చేయడం చరిత్రలో నిలిచిపోతాయని అన్నారు. శని, ఆదివారాలలో నిర్వహించే జూనియర్ కాలేజీ, డిగ్రీ, పీజీ కళాశాలలో ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పీఎల్ఎన్ రెడ్డి, కార్యదర్శి నిర్మలమ్మ, కోశాధికారి సుంకు వేణుగోపాల్, కమిటీ మెంబరు ఎస్ఆర్ నాగభూషణం, పూర్వ ఉపాధ్యాయులు సదానందం, శ్రీరాములు, సుధారాణి, ఆంజనేయులు, రోహిణికుమార్, సీతారామశాస్త్రి, శ్రీనివాసులు, హెచ్ఎం సుధామణి, ఉపాధ్యాయులు నాగరాజు, లక్ష్మీనారాయణ, వేణుకోప్రారావ్, రమణారెడ్డి, పద్మావతి, పద్మలత, విద్యావతి, మౌనిక, జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ రామ్మోహన్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చొరవ

\- ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంపీ అంబికా

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): క్రీడాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపుతున్నాయని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. కేంద్ర యువజన, క్రీడా శాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎస్కే యూనివర్సిటీ క్రీడామైదానంలో జిల్లా స్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఎంపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వర్సిటీ రిజిస్ట్రార్ రమేష్‌బాబు, స్పోర్ట్స్ సెక్రటరీ జెస్సీలు క్రీడా పోటీలను ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్, ఖో ఖో పోటీల్లో విజేతలకు ఎంపీ బహుమతులు అందజేశారు. ప్రతి ఒక్కరూ పాఠశాల స్థాయి నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సహకారంలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్రం ప్రోగ్రాం ఇన్‌చార్జి శ్రీనివాసులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత బిసాటి భరత్, రెఫరీలు దాదావలీ, రాఘవేంద్ర, సింహాద్రి, రాజారెడ్డి, ప్రగతిపథం యూత్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

8న జిల్లాలో కేంద్ర కరువు బృందం పర్యటన

అనంతపురం అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌లో జరిగిన పంట నష్టంపై అధ్యయం కోసం కేంద్ర కరువు బృందం ఈనెల 8న జిల్లాలో పర్యటించనుంది. జిల్లాలోని ఏఏ మండలాల్లో పర్యటిస్తారన్న షెడ్యూల్ ఖరారు చేయాల్సి ఉంది. షెడ్యూల్ ఖరారు చేసే పనిలో వ్యవసాయ శాఖ అధికారులు నిమగ్నమయ్యారు.

మొక్కవోని ప్రయత్నం

వెయ్యి మొక్కలు నాటిన చిన్నారి నవని



నవనిని అభినందిస్తున్న రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్/ కల్చరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రెండో తరగతి చిన్నారి సుంకర నవని పర్యావరణహితం కోసం చేసే ప్రయత్నం అందరినీ ఆకట్టుకుంటోంది. కేంద్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు ఏక్ పేడ్ మాకి నామ్ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంపై ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ మీడియా ద్వారా చేసే సూచనలతో నగరానికి చెందిన చిన్నారి నవని స్ఫూర్తి పొంది, మొక్కలు నాటడం ప్రారంభించింది. తల్లిదండ్రులు రమేష్, కల్పన సహకారంతో ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ ప్రాంతాలలో ఇప్పటి వరకు సుమారు వెయ్యి మొక్కలు నాటింది. ఈనేపథ్యంలో రాష్ట్ర రాజధాని అమరావతిలో ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను చిన్నారి తన తల్లిదండ్రుల సహకారంతో శుక్రవారం కలిసింది. వారు చిన్నారి సేవాగుణాన్ని అభినంది, సర్టిఫికెట్ అందజేసి, ఆశీర్వదించారు.

టీచర్లకూ ఐదేళ్ల సర్వీసు నిబంధన తేవాలి

అనంతపురం విద్య, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల్లో గరిష్టంగా ఐదేళ్ల సర్వీసు ఉండేలా మార్గదర్శకాలు రూపొందించాలని ఏపీ స్టేట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేష్‌కు లేఖ రాసినట్లు పేర్కొన్నారు. ఒకే స్కూలులో 8 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులను, 5 ఏళ్ల సర్వీసు పూర్తయిన ప్రధానోపాధ్యాయులను తప్పనిసరి బదిలీలు చేస్తున్నారన్నారు. ఇతరశాఖల్లో ఒకే స్థానంలో 5 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారిని బదిలీ చేస్తున్నారన్నారు. టీచర్లను సైతం 5 ఏళ్ల గరిష్ట సర్వీసు నిబంధనను తీసుకుకావాలన్నారు.

ట్రేడ్ మార్క్..!

- అవినీతిలో కొత్తదారులు
- ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లింపులో టోకరా
- సొంతజేబులు నింపుకున్న కొందరు అధికారులు
- ఏళ్ల తరబడి చెల్లించని మొండి యజమానులు
- నగరపాలికకు రూ.కోట్లలో పేరుకుపోయిన బకాయిలు



త్రిబుల్ ఎస్ బార్ అండ్ రెస్టారెంట్

అనంతపురం క్రైం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): నగరపాలిక ట్రేడ్ లైసెన్స్‌లో మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. దీంతో నగరపాలిక ఆదాయానికి గండి పడుతోంది. నగరంలో కొన్ని దుకాణాలు, పెద్ద వ్యాపారాలు నిర్వహించే షాపులకు కనీసం ట్రేడ్ లైసెన్స్ ఫీజు కూడా లెక్కించలేదు. దీంతో వారు దర్జాగా వ్యాపారం చేసుకుంటూ కార్పొరేషన్ ఆదాయానికి గండికొడుతున్నారు. నగరపాలికలో ట్రేడ్‌లైసెన్స్ వ్యవహారాలను పబ్లిక్ హెల్త్ విభాగం పర్యవేక్షిస్తుంది. ఇందులో పని చేసే కొందరు అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల గతం నుంచి కూడా చేతివాటం చూపుతున్నారనే ఆరోపణలున్నాయి. తాజాగా విజిలెన్స్ అధికారులు నగరంలోని ట్రేడ్ లైసెన్స్‌ల విషయంలో బకాయిల లెక్కల చిట్టా నగరపాలిక అధికారులకు ఇచ్చారు. ఇక కొన్ని దుకాణాలు ఓ ఫర్మ్ పేరుతో ఏర్పాటు చేసి వ్యాపారాలు జరగక, మరి కొన్ని కారణాలతోనూ వాటిని తొలగించారు. అలాంటి సంఖ్య బాగానే ఉన్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. ఇలా బకాయిలు నగరపాలికలో పేరుకుపోయాయి.



నవీద్ రెసిడెన్సీ

నగరపాలికకు రూ.4కోట్ల బకాయిలు

అనంతపురం నగర పరిధిలో 50 డివిజన్లున్నాయి. నగర పరిధిలో ఎలాంటి వ్యాపారం నిర్వహించేవారైనా దుకాణం తీసుకుంటే అందుకు సంబంధించి నగరపాలికకు ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఆ మొత్తం ఏడాదికోసారి వసూలు చేస్తారు. ఇందులో మొత్తం 10,060 వరకు అసెస్మెంట్లున్నాయి. వాటి నుంచి ట్రేడ్ లైసెన్సులకు సంబంధించి కార్పొరేషన్ కార్యాలయంలో నమోదు చేశారు. ఇందులో కనీసం చిన్న సైజు గదులున్న కిరాణా దుకాణాల నుంచి హోటళ్లు, ఆసుపత్రులు, బార్లు, రెస్టారెంట్లు ఉంటాయి. చిన్న దుకాణాలైతే కనీసం రూ.1000ల నుంచి పెద్ద వ్యాపార సముదాయమైతే రూ.20వేల వరకు ఉంటాయి. ప్రతి ఏటా రెన్యువల్ చేసుకుంటూ ఆ మొత్తం చెల్లిస్తారు. కనీసం ఒక్కో దుకాణం నుంచి రూ.2వేల ప్రకారం లెక్క వేసుకున్నా ప్రతి ఏటా రూ.2కోట్లు కార్పొరేషన్ ఖజానాలోకి చేరాలి. కానీ ఇప్పటివరకు రూ.4కోట్ల వరకు బకాయిలున్నట్లు అధికారులు నిర్ధారించారు.

జేబులు నింపుకున్న ఘనులు

నగరంలో ట్రేడ్ లైసెన్స్ వసూలు, చెల్లింపు అంతా పారిశుధ్య విభాగం అధికారులే పర్యవేక్షిస్తుంటారు. 2015 వరకు అంతా ఆఫ్‌లైన్‌లోనే ఉండటంతో డబ్బు తీసుకుని కేవలం రసీదులిచ్చేవారు. ఇందులో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు బాగా చేతివాటం చూపేవారు. దుకాణదారులతో ఒప్పందం చేసుకుని ఎంతో కొంత పుచ్చుకునేవారు. ఆ మొత్తం కార్పొరేషన్‌కు చెల్లించకుండా జేబులో వేసుకునేవారు. రూ.5వేలకుపైగా నే చెల్లించాల్సి ఉన్న వ్యాపార సముదాయాల నుంచి సగం మాత్రమే వసూలు చేసేవారు. 2016 లో ట్రేడ్‌లైసెన్స్‌లన్నీ ఆన్‌లైన్ చేశారు. అప్పటి నుంచి కూడా కొందరు గోల్‌మాల్ చేశారనే ఆరోపణలున్నాయి. సచివాలయ వ్యవస్థ ఏర్పాటయ్యాక శానిటరీ సెక్రెటరీలకు అప్పగించడంతో ఆ వ్యవహారం చాలావరకు తగ్గినట్లు తెలిసింది. నగరంలో ఏదో ఒక పేరుతో షాపులు తెరిచి ట్రేడ్ లైసెన్స్ చెల్లించని దుకాణాలు నగరంలో 1500 నుంచి 2వేల వరకు ఉన్నట్లు తెలిసింది. బిజినెస్ ఎక్కువగా జరిగే కమలానగర్‌లోనే 300వరకు ఉన్నట్లు సమాచారం. వీటి నుంచి రూ.80లక్షల ఫీజు రావాల్సి ఉన్నట్లుగా నిర్ధారించినట్లు తెలిసింది.

లైసెన్సే తీసుకోం..

ఏటా రూ.లక్షల నుంచి రూ.కోట్లలో వ్యాపారం చేస్తున్నా కొందరు ట్రేడ్ లైసెన్స్ కూడా తీసుకోరు. శ్రీకంఠం సర్కిల్‌లో నవీద్ రెసిడెన్సీ పేరుతో ఓ లాడ్జి నిర్వహిస్తున్నారు. కొంత కాలం కిందటి వరకు అదే రెసిడెన్సీలోనే హోటల్ కూడా నిర్వహించారు. 15ఏళ్ల నుంచే ఇక్కడ వ్యాపారం జరుగుతోంది. కానీ ఇంతవరకు ట్రేడ్ లైసెన్స్ తీసుకోలేదట. సిబ్బంది వెళితే...రాజకీయనాయకుల పేర్లు చెప్పుకుంటూ చెలామణి అవుతున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి వ్యాపార సముదాయాలు నగరంలో 100కు పైగా ఉన్నట్లు సమాచారం. టవర్‌క్లాక్ సమీపంలోని పోలీస్‌కాంప్లెక్స్‌లో దాదాపు 175వరకు దుకాణాలున్నాయి. వీటిలో 10శాతం మాత్రమే అప్పుడప్పుడు ట్రేడ్ లైసెన్స్ చెల్లిస్తున్నట్లు తెలిసింది. ప్రాపర్టీ టాక్స్ ఏమాత్రం చెల్లించని ఈ దుకాణాల నుంచి రెండేళ్ల నుంచి ట్రేడ్‌లైసెన్స్ వసూలు కానట్లు తెలుస్తోంది. ఆర్టీసీ బస్టాండ్ నుంచి గుత్తిరోడ్డుకు వెళ్లే దారిలోని త్రిబుల్ ఎస్ బార్ అండ్ రెస్టారెంట్ పేరుతో ఏకంగా నాలుగు ట్రేడ్ లైసెన్సులున్నాయట. 2016లో రెండు, అనంతరం మరో రెండు పేర్లతో రిజిస్టర్ చేయించారు. ఇలా మార్చడానికి ముందు తీసుకున్న పేర్లతో ఎక్కువ మొత్తం చెల్లించాల్సి రావడం, మరో పేరుతో తగ్గించుకోవడానికే ఇలా చేస్తారని కార్పొరేషన్ వర్గాలంటున్నాయి. అప్పట్లో పనిచేసిన శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీల సహకారంతోనే ఇలా చేసినట్లు సమాచారం. ఈ బార్ నుంచి రూ.1లక్షకు పైగా బకాయి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కమలానగర్‌లోనే ఓ వస్త్ర వ్యాపారం చేసే నిర్వాహకుడు ట్రేడ్ లైసెన్స్ చెల్లించమంటే ఎవరెవరి పేర్లో చెబుతాడట. 2019 నుంచి 24 వరకు ప్రతి ఏట 50 నుంచి 60శాతం మాత్రమే వసూలవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.



పోలీస్ షాపింగ్ కాంప్లెక్స్

బకాయిలలో కొన్ని...

నగరంలో కొన్ని వేల నుంచి రూ.లక్షల్లో బకాయిలున్నాయి. గ్రీన్ బావర్చీ రెస్టారెంట్‌కు రూ.1.50లక్షలు, అనంతపురం క్లబ్‌కు రూ.1.50లక్షలు, త్రిబుల్ ఎస్ బార్‌కు రూ.1.20లక్షలు, గణేష్ రెస్టారెంట్‌కు రూ.80వేలు, పవర్‌రెస్టారెంట్ హోటల్, గోల్డెన్ తాజ్ హోటల్, విద్యానికేతన్ స్కూల్, పారడైజ్ బార్ రెస్టారెంట్, తిప్పయ్య మోటార్స్, ఎంపైర్ ఫ్యామిలీ రెస్టారెంట్, సాయి డయాగ్నస్టిక్ అండ్ ఫెటల్ మెడిసిన్, రేణుక వైన్స్, విజయ వైన్స్, చరిత వైన్స్, జేకేఆర్ వైన్స్, ఎల్ఎన్ వైన్స్, సాయి తేజ వైన్స్, ఎస్ఎస్ వైన్స్, అనురాధ వైన్స్, క్రాంతి హాస్పిటల్, జేబీ రెస్టారెంట్, బేబీ హాస్పిటల్‌లకు సంబంధించి ఒక్కో దానికి రూ.42వేల నుంచి రూ.60వేల వరకు బకాయిలున్నాయి. వీటిలో కొన్ని వ్యాపార సంస్థలు మార్చేయడం గమనార్హం.

నడవలేనిస్థితిలో కృష్ణజింక



జంతు సంరక్షణశాలలో జింకను అప్పగిస్తున్న అధికారులు

గోరంట్ల, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాగానిపల్లి సమీపంలోని రైతు విష్ణు పొలంలో శుక్రవారం కృష్ణజింక నడవలేని స్థితిలో కనిపించింది. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు రాహుల్, రామక్రిష్ణ అక్కడికి చేరుకుని కృష్ణజింకను పరిశీలించారు. శరీరంపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో లేచి వెళుతుందేమోనని చాలా సేపు వేచి చూశారు. పక్షపాతం వల్ల అనారోగ్యానికి గురైందని బుక్కపట్నం అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ యామినీ సరస్వతికి పరిస్థితి వివరించారు. ఆమె ఆదేశాల మేరకు పుట్టపర్తిలోని జంతు సంరక్షణ శాలకు తరలించి చికిత్సలు అందిస్తున్నారు.

డీజిల్‌షెడ్ ఉద్యోగులకు జీఎం అవార్డులు

గుత్తి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): గుత్తి రైల్వే డీజిల్ షెడ్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉద్యోగులు శుక్రవారం సికింద్రాబాద్‌లో దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. స్థానిక డీజిల్ షెడ్‌లో పనిచేస్తున్న ఆఫీస్ సూపరింటెండెంట్ మల్లికార్జున, ఎలక్ట్రికల్ లోకో సీనియర్ సెక్షన్ ఇంజనీర్ మనోజ్‌కుమార్ అవార్డు అందుకున్నారు. స్థానిక సీనియర్ డీఎంఈ ప్రమోద్, అధికారులు, సూపర్‌వైజర్లు, కార్మికసంఘం ప్రతినిధులు అవార్డు గ్రహీతలను అభినందించారు.





అవార్డులు అందుకుంటున్న మనోజ్ కుమార్, మల్లికార్జున

నిరుద్యోగుల చెంతకే కంపెనీలు

ధర్మవరంలో 9న మెగా జాబ్‌మేళా
పోస్టర్లు ఆవిష్కరించిన మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగం కల్పించే లక్ష్యంతో నిర్వహిస్తున్న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సంస్కృతి సేవాసంస్థ సౌజన్యంతో ఈనెల 9న ధర్మవరంలోని సీఎన్‌బీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాకు సంబంధించి శుక్రవారం విజయవాడలో ఆయన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వివిధ కోర్సులు పూర్తి చేసుకున్న యువతీ యువకులు ఉద్యోగాల కోసం వివిధ కంపెనీల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో దేశంలోని 90 ప్రముఖ కంపెనీలను నిరుద్యోగుల చెంతకే తీసుకువచ్చి మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, నర్సింగ్, ఏదైనా డిగ్రీ, పీజీ చదివి 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల వయసు కలిగి ఉండాలన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.10వేల నుంచి రూ.50వేల వరకు జీతం ఉంటుందన్నారు. విద్యార్హత జిరాక్స్ పత్రాలు, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలతో రావాలని మంత్రి తెలిపారు. మరిన్ని వివరాలకు .. 9182288465, 9490442576, 9390176421 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

టమోటా కిలో రూ.10



అనంతపురం రూరల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.10తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం మార్కెట్‌కు 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.8, కనిష్ఠ ధర రూ.5 పలికినట్లు ఆయన తెలిపారు.

న్యూస్ బాక్స్

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



పల్లవి



సత్యప్రకాష్



ద్వారకానాథ్ రెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈనెల 6వతేదీ గుజరాత్‌లోని భావానగర్‌లో జరిగే జాతీయ మహిళ, పురుషుల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లాకు చెందిన పల్లవి, సత్యప్రకాష్, ద్వారకానాథ్‌రెడ్డి రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. క్రీడాకారులను బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నరేంద్రచౌదరి, డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్ అభినందించారు.

వరి, వేరుశనగ సస్యరక్షణపై శిక్షణ



మాట్లాడుతున్న ఏరువాక కోఆర్డినేటర్ రామసుబ్బయ్య

పుట్టపర్తిరూరల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): వరి, వేరుశనగ పంటలకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏరువాక జిల్లా కోఆర్డినేటర్ రామసుబ్బయ్య తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని కొట్లపల్లిలో వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో వరి, వేరుశనగ పంటలకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామసుబ్బయ్య మాట్లాడుతూ మండలంలో వరిపంట ప్రస్తుతం పిలకదశలో ఉందన్నారు. వరిలో కాలిబాటలు తీయాలన్నారు. దీనివల్ల గాలి, వెలుతురు బాగా ఆడి పంట ఆరోగ్యంగా ఉంటుందన్నారు. క్రిమిసంహారక మందులు వేయడానికి అనువుగా ఉంటుందన్నారు. వేరుశనగ ప్రస్తుతం ఊడలు దిగే దశకు చేరుకుందన్నారు. రసం పీల్చే పురుగుల నివారణకు ఈమిడాక్లోప్రిడ్ 0.4 మిల్లీమీటర్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. శనగపంట ప్రస్తుతం కాయ అభివృద్ధి దశలో ఉందని, దీనికి ఎండతెగులు ఆశించకుండా ఎక్సాకొనజోల్ పిచికారి చేయాలన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

తాడిపత్రి, జనవరి3(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని చల్లవారిపల్లి రైల్వేస్టేషన్ వద్ద రైలులో నుంచి జారిపడి మోహన్‌నాయక్ (31) మృతి చెందినట్లు రైల్వే ఎస్‌ఐ నాగప్ప తెలిపారు. పట్టణంలోని విజయనగర్‌కాలనీకి చెందిన జయరాంనాయక్, లీలాబాయ్ దంపతుల కుమారుడు మోహన్‌నాయక్ టీస్టాల్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తల్లి లీలాబాయ్‌కు కంటి ఆపరేషన్ కోసం కడపకు వెళ్లి తిరిగి రైలులో వస్తుండగా తాడిపత్రి రైల్వేస్టేషన్‌లో రైలు ఆగకపోవడంతో గుత్తిలో దిగారు. అక్కడి నుంచి తాడిపత్రికి వెళ్లడానికి మరో రైలు ఎక్కారు. లీలావతిబాయ్ మహిళల కోచ్‌లో ఎక్కగా, మోహన్‌నాయక్ మరో కోచ్‌లో ఎక్కాడు. లీలావతిబాయ్ తాడిపత్రిరాగానే రైలు నుంచి దిగింది. మోహన్‌నాయక్ పొరపాటున స్టేషన్‌లో దిగలేదు. చల్లవారిపల్లి స్టేషన్ రాగానే తాడిపత్రిస్టేషన్ వెళ్లిపోయిందని గమనించి నెమ్మదిగా వెళుతున్న రైలు నుంచి దిగేందుకు ప్రయత్నించాడు. కానీ జారి పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని రైల్వే సిబ్బంది గమనించి, తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దున్నపోతు కోసం రెండు గ్రామాల వార్

కూడేరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఓ దున్నపోతు కోసం రెండు గ్రామాల మధ్య వివాదం నెలకొంది. కూడేరు మండలం ముద్దలాపురం, కడదరకుంట గ్రామాల మధ్య దున్నపోతు వివాదం చిలికి చిలికి గాలివానగా మారింది. శుక్రవారం ముద్దలాపురం గ్రామస్థులు కలెక్టర్‌ను కలిసి తమ దున్నపోతు కడదరకుంట గ్రామస్థుల బందీలో ఉందని, విడిపించాలని వినతి పత్రం అందజేశారు. ఈ నెల 21న కడదరకుంట, 22న ముద్దలాపురం గ్రామాల్లో దేవర జరుగనుంది. గ్రామ దేవతలకు బలిచ్చే దున్నపోతు వివాదం ఆ రెండు గ్రామాల మధ్య చిచ్చురేపింది. దున్నపోతు తమదంటే, తమదని ఇరు గ్రామస్థులు వాదనకు దిగుతున్నారు.

799 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శుక్రవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 799 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2 కు 450 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు.

చీనీ కాయలు టన్ను రూ.29వేలు

అనంతపురంరూరల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.29,190, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.18,600లతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 22 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

విజయమే లక్ష్యం

రాష్ట్రస్థాయిలోనూ అవార్డులు సాధించాలి
కలెక్టర్ వినోద్‌కుమార్
ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులకు అభినందన
ముగిసిన జిల్లాస్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శన



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

రాప్తాడు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విజయమే లక్ష్యంగా కష్టపడాలని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని ఆదర్శ పాఠశాలలో శుక్రవారం జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన-2025 నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటూ అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ఎమ్మెల్సీ మంగమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు విజయం వెంట పరుగులు తీయాలన్నారు. కృషి, పట్టుదల, దీక్ష, క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. విద్యార్థి దశలో అపజయం ఎదురైతే నిరాశ పడకుండా మరింత ఉత్సాహంతో ముందుకెళ్లాలని సూచించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలు బాగున్నాయన్నారు. జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్ర స్థాయిలో కూడా బహుమతులు గెలుచుకోవాలన్నారు. విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనపై తమ అనుభవాలు వివరించిన విద్యార్థులు గంగోత్రి, వాణి, వేణుభాస్కర్‌లను కలెక్టర్ అభినందించారు. ఎంపీ అంబికా మాట్లాడుతూ విద్యార్థులు పోటీ ప్రపంచంలో భిన్నంగా ఆలోచించడంతో పాటు కృషి, పట్టుదలతో చదువుకున్నప్పుడే ముందుకు వెళతారన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత కోరిక మేరకు ఆదర్శ పాఠశాలలో అవసరమైన పనులు చేపట్టేందుకు రూ. 5 లక్షల ఎంపీ నిధులు మంజూరు చేస్తామన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ఆరుగురు విజేతలుగా నిలవడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం చాలా మంది విద్యార్థులకు తింటున్న ఆహారం ఎలా వస్తుందో కూడా తెలియని పరిస్థితి ఉందన్నారు. అందుకే ఉపాధ్యాయులు వ్యవసాయం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో గెలుపొందినవారికి పరిటాల రవీంద్ర ట్రస్ట్ ద్వారా రూ. లక్ష విరాళాన్ని ప్రకటించారు. ఎమ్మెల్సీ గంగమ్మ మాట్లాడుతూ విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు ఎంతో బాగున్నాయన్నారు. ప్రభుత్వం అందించే అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ ప్రసాద్‌బాబు, రాప్తాడు సర్పంచ్ సాకే తిరుపాలు, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ విజయకుమారి, ఎంఈఓ మల్లికార్జున, ప్రిన్సిపల్ పద్మజాదేవి, జిల్లా వైజ్ఞానిక అధికారి బాలమురళి, జ్యూరీ మెంబర్లు పీఎల్‌ఎన్ ప్రసాద్, రఘురాం, డిప్యూటీ డిఈఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, డీఈఓ

రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు 9 ప్రాజెక్టులు

అనంతపురం విద్య, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ నుంచి రాష్ట్ర స్థాయికి 9 ప్రాజెక్టులను ఎంపిక చేసినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, జిల్లా సైన్స్ ఆఫీసర్ బాలమురళీ కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యక్తిగత విభాగంలో రాప్తాడు జడ్పీ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి ఆర్‌ఎస్ రెడ్డి ప్రాజెక్టు, గుంతకల్లు మండలం కసాపురం జడ్పీ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి వంశీ ప్రాజెక్టు, డి. హీరేహాళ్ మండలం హోసగుడ్డం ఎంపీయూపీ స్కూల్ నవిక ప్రాజెక్టులను ఎంపిక చేశామని తెలిపారు. గ్రూప్స్ విభాగం నుంచి కణేకల్లు మండలం హనకనహాళ్ జడ్పీ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థులు గీతారెడ్డి, మహాలక్ష్మి ప్రాజెక్టు, పుట్లూరు మండలం శనగలగూడూరు జడ్పీ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థులు హరిణి, చర్విత ప్రాజెక్టు, తాడిపత్రి మోడల్ స్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థులు యజ్ఞశ్రీ, మధురిమ ప్రాజెక్టులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. టీచర్స్ విభాగం నుంచి ఉరవకొండ మండలం ఆమిద్యాల జడ్పీ హైస్కూల్ టీచర్ శ్రీనివాస్ ప్రాజెక్టు, పెద్దపప్పూరు మండలం పెద్దయక్కలూరు జడ్పీ హైస్కూల్ టీచర్ కృష్ణమోహన్‌రెడ్డి ప్రాజెక్టు, కూడేరు మండలం కరుట్లపల్లి జడ్పీ హైస్కూల్‌కు చెందిన మహమ్మద్ రఫీ ప్రాజెక్టులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.



పాముల నుంచి రైతులను కాపాడే స్టిక్

మూడు అడుగుల ప్లాస్టిక్ పైపునకు కింద భాగాన ఒక ప్లాస్టిక్ గరాటు అతికించా. అందులో ఒక వైబ్రేటర్‌ను రెండు వైర్ల సాయంతో ప్లాస్టిక్ స్టిక్ పైన బ్యాటరీకి కలిపా. స్టిక్ మధ్యలో ఒక డూమ్‌లైట్ అమర్చా. శబ్దం వచ్చేందుకు ఒక బజ్‌ను అమర్చా. వీటన్నింటిని స్టిక్ హ్యాండిల్ వద్ద కలిపి స్విచ్ అమర్చా. స్విచ్ ఆన్ చేస్తే వైబ్రేటర్ కదిలి శబ్దం వస్తుంది. స్టిక్ పట్టుకుని లైట్ ఆన్ చేసుకుని రైతులు పొలాల్లో నడిచేటప్పుడు ఆ శబ్దానికి పాములు, ఇతర విషపురుగులు దగ్గరకు రావు. ఈ స్టిక్ ద్వారా రైతులు పాముల నుంచి ఎదురయ్యే ప్రమాదాల నుంచి తప్పించుకోవచ్చు.

- శంకర్‌నాథ్‌రెడ్డి విద్యార్థి రాప్తాడు ఉన్నత పాఠశాల (రాష్ట్ర స్థాయికి ఎంపిక)

పర్యావరణ హిత ఇంధన గుళికలు

కసాపురం చుట్టు పక్కల కొండల్లో తేనె పట్టు ఎక్కువగా దొరుకుతుంది. పట్టు నుంచి తేనె తీసిన తరువాత మైనం పడేస్తారు. అలాకాకుండా ఆ మైనాన్ని తెచ్చి వేడి నీళ్లలో కరిగించాలి. తర్వాత చిన్న చిన్న స్టీలు కప్పుల్లో రంపపుపొట్టు తీసుకుని దానిలోకి మైనం కలపాలి. 15 నిమిషాల తరువాత మైనం గడ్డ కడుతుంది. గడ్డ కట్టిన మైనం ఇంధన గుళికలుగా మారుతుంది. 10 గ్రాములు ఇంధన గుళికలు 15 నిమిషాలు వెలుగుతాయి. 10 గ్రాములు ఇంధన గుళికలు తయారీకి రూపాయి ఖర్చు అవుతుంది. 4 గుళికలు ఉంటే అరకిలో బియ్యం వండుకోవచ్చు. బయట ప్రదేశాల వెళ్లినప్పుడు అన్నం, ఇతర ఆహార పదార్థాలు వండుకునేందుకు ఈ పర్యావరణ హిత గుళికలు చాలా ఉపయోగకరం.

- వంశీ, విద్యార్థి కసాపురం ఉన్నత పాఠశాల (రాష్ట్ర స్థాయికి ఎంపిక)



జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



విద్యార్థిని అనిత

ఉరవకొండ,జనవరి 3(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం గడే చిన్నహోతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న అనిత అనే విద్యార్థిని జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పీడీ ప్రభాకర్ తెలిపారు. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో ఈ నెల 10 నుంచి 15 తేదీ వరకూ జరిగే జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో విద్యార్థిని పాల్గొంటుందని హెచ్‌ఎం ఎంబీఎల్ ప్రసాద్ తెలిపారు. విద్యార్థిని ఎంపిక పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

అటవీ స్థలాల రక్షణపై శ్రద్ధ

● డీఎఫ్ఓ విఘ్నేష్

అనంతపురం న్యూటౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అటవీస్థలాల రక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందిని డీఎఫ్ఓ విఘ్నేష్ ఆదేశించారు. గుత్తి రేంజర్ కార్యాలయంలో రేంజర్ మధుబాబుతో కలిసి శుక్రవారం ఆయన సిబ్బందికి అటవీ స్థలాల రక్షణ, మొక్కల సంరక్షపై చేపట్టాల్సిన చర్యలు, వన్యప్రాణుల సంరక్షణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది చేపట్టాల్సిన అంశాలకు సంబంధించి డీఎఫ్ఓ పలు సూచనలు చేశారు. అనంతరం శాఖ పరమైన అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత నెలలో సిబ్బందికి రెండు సార్లు శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. ఈక్రమంలోనే శుక్రవారం గుత్తి రేంజ్ పరిధిలోని సిబ్బందికి శిక్షణ ఏర్పాటు చేసినట్లు డీఎఫ్ఓ తెలిపారు. శిక్షణలో ప్రధానంగా అటవీ స్థలాలు, ఆస్తుల రక్షణపై సిబ్బందికి తగిన శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈనేపథ్యంలోనే జక్కల చెరువు బీట్‌కు వెళ్లి, అక్కడ 10 హెక్టార్లలో నాటిన మొక్కలను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. సమావేశంలో సెక్షన్ ఆఫీసర్లు నారపరెడ్డి, జగన్నాథం, కరీముల్లా, బీట్ ఆఫీసర్లు రమేష్‌బాబు, సుధాకర్, మాధవి, రాజేశ్వరి, వెంకటరమణ, చంద్రశేఖర్, సతీష్‌కుమార్, మంజులవాణి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు యువతి అదృశ్యం



కోమలత(ఫైల్)

అనంతపురం క్రైం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా పత్తికొండ పట్టణానికి చెందిన కోమలత అనంతపురం నగరంలో అదృశ్యమైందని టూటౌన్ సీఐ శ్రీకాంత్ తెలిపారు. కోమలత అనంతపురం నగర శివారులోని ఓ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. సాయినగర్‌లోని ప్రైవేటు ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటోంది. గత నెల 28వ తేదీ ఉదయం హాస్టల్ నుంచి అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జగన్ అవినీతిపై ఉపేక్ష తగదు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీశ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు జగదీశ్

గుంతకల్లు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కొనుగోలు ఒప్పందంలో మాజీ సీఎం జగన్ అవినీతిపై కేసులు పెట్టి విచారంచేందుకు ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి. జగదీశ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఏడు వేల మెగా వాట్ల విద్యుత్ కొనుగోలు విషయంలో ఆదానీ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందాల్లో భారీ అవినీతి జరిగిందని అమెరికా దర్యాప్తు సంస్థలు స్పష్టంచేసి కేసులు నమోదు చేశాయని తెలిపారు. అందులో జగన్‌కు రూ.1,750 కోట్ల ముడుపులు ముట్టినట్టు ఆరోపణలు వచ్చినా కూటమి ప్రభుత్వం ఉపేక్షించడం తగదని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు వీరభద్రస్వామి, గోపి, మహేశ్, మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు.

పంచాయతీ నిధులు పక్కదారి

పని గోరంత...బిల్లులు కొండంత
ఏడాదిలో కోటికి పైగా నిధులు డ్రా
అధికారులు, నాయకుల కుమ్మక్కు
విచారణలో అక్రమాలు వెలికి తీసేరా..?

హిందూపురం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): చిలమత్తూరు మండలంలో పంచాయతీ నిధులు పక్కదారి పట్టినట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. మండలంలో కొంత కాలంగా పనిచేస్తున్న ఓ కార్యదర్శి చేతివాటం ప్రదర్శించి నిధులు భారీ ఎత్తున డ్రా చేసినట్లు తెలుస్తోంది. అధికారి బంధువులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధుల పేరుమీద నిధులను డ్రా చేసినట్లు ఇటీవల మేరీ పంచాయతీ వెబ్‌సైట్ యాప్ ద్వారా వెలుగు చూసినట్లు సమాచారం. ఇప్పటికే దీనిపై ఉన్నతాధికారులు విచారణ ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఆ కార్యదర్శి పీఎఫ్‌ఎంఎస్ ద్వారా కొన్నింటికి ఎం.బుక్కులు లేకుండా నిధులు డ్రా చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ కార్యదర్శి ఎక్కడ పనిచేసినా నాయకులను సమన్వయ పరుచుకోవడంలో దిట్టగా పేరుగాంచారు. గత వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకులతో కలిసి పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక కొంత మంది అధికార పార్టీ నాయకులు ఏరికోరి అతడికి పంచాయతీలను అప్పగించారు. అతడు పనిచేసిన పంచాయతీల్లో గోరంత పనులు ఉన్నా కొండంత నిధులు డ్రా చేసినట్లు విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా వాటర్ వర్క్స్‌కి సంబంధించిన బిల్లులు ఎక్కువ ఉన్నట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కొంత మంది నాయకులతో కలిసి పాత వాటికే బిల్లులు మంజూరు చేసినట్లు సమాచారం. ఆయన 2024 జనవరి నుంచి ఇప్పటి వరకు తాను పనిచేసిన పంచాయతీల్లో రూ. 1.3 కోట్లు నిధులను డ్రా చేసినట్లు అధికారులు అంచనా వేశారు. ఇందులో అధిక శాతం వాటర్ వర్క్స్‌కే కేటాయించినట్లు తెలుస్తోంది. ఒకే కార్యదర్శికి మూడు పంచాయతీల బాధ్యతలను అప్పగించారు. ఇందులో మేజర్ పంచాయతీ ఉంది. ఈ పంచాయతీకి నిధులు పుష్కలంగా ఉన్నాయి. ఇదే అదనుగా భావించి కార్యదర్శితో పాటు స్థానిక ప్రజాప్రతినిధి, అధికార పార్టీకి చెందిన నాయకులు ఆ నిధులపై కన్నేశారు. దీంతో సెప్టెంబరు నుంచి నిధులు డ్రా చేయడం ప్రారంభించారు. సెప్టెంబరు 5న సచివాలయం అద్దె కోసం రూ. 1.38 లక్షలు, అదే రోజు నీటి నిర్వహణ కోసం రూ. 50 వేలు, సెప్టెంబరు 19న నీటి నిర్వహణ కోసం రూ. 6.61 లక్షలు, 23న రూ. 4.57 లక్షలు, అదే రోజున నీటి నిర్వహణ కోసం రూ. 2 లక్షలు, 24న నీటి నిర్వహణ కోసం రూ. 3.85 లక్షలు డ్రా చేసినట్లు తెలుస్తోంది. ఒకే పంచాయతీలో కూటమి ప్రభుత్వం వచ్చాక అరకోటికి పైగా నిధులు డ్రా చేసినట్లు సమాచారం. కార్యదర్శితో కొంత మంది అధికార పార్టీకి చెందిన నాయకులు కుమ్మక్కై పంచాయతీ నిధులు పక్కదారి పట్టించినట్లు, కొన్ని పనులు చేయకుండానే నిధులు డ్రా చేసినట్లు సమాచారం. అధికార పార్టీలోని ఓ వర్గం నాయకులు మేరీ పంచాయతీ వెబ్‌సైట్ ద్వారా డ్రా చేసిన బిల్లులను ఆన్‌లైన్ ద్వారా చూసి వాటికి సంబంధించి స్ర్కీన్ షాట్‌లను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. ఇందులో అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు లక్షల్లో బిల్లులు డ్రా చేసినట్లు, స్థానిక ప్రజాప్రతినిధికి చెందిన బంధువులు, వైసీపీకి చెందిన కార్యకర్తల పేరుమీద కూడా నిధులు డ్రా చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి చేరింది. దీంతో మూడు రోజుల క్రితం ఎమ్మెల్యే దీనిపై విచారణ చేయాలని జిల్లా అధికారికి సూచించినట్లు సమాచారం. ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేయడంతో మేజర్ పంచాయతీ విధుల నుంచి కార్యదర్శిని తప్పించారు. ఎమెల్యే దీనిపై సీరియస్‌గా పరిగణించడంతో ఉన్నతాధికారులు విచారణ ఏ రీతిలో చేస్తారనేది వేచి చూడాలి.



సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నిధులు డ్రా చేసిన బిల్లులు ఇవే..

న్యూస్ బాక్స్

‘తల్లికి వందనం’ ఈ ఏడాది నుంచే ఇవ్వాలి



నిరసన తెలుపుతున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

అనంతపురం విద్య, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్లు తల్లికి వందనం ఈ విద్యా ఏడాది నుంచే అమలు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం నాయకులు అంబేడ్కర్ విగ్రహం వద్ద అర్ధనగ్న ప్రదర్శన చేస్తూ నిరసన తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమంతరాయుడు, ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే తల్లికి వందనం పేరుతో ప్రతి బిడ్డకు రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి 8 నెలలు కావస్తున్నా.... హామీ అమలు చేయలేదన్నారు. నాయకులు నరసింహయాదవ్, మంజునాథ్, చందు, ఉమామహేష్, రాజేష్, మంజు, అబి, కార్తీక్, యశ్వంత్ పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



బహుమతులు సాధించిన విద్యార్థులతో ఏజీఎం, ఉపాధ్యాయులు

అనంతపురం రూరల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాములాయి గ్రామ సమీపంలో ఉన్న శ్రీచైతన్య పాఠశాల సివిల్స్ బ్యాచ్ విద్యార్థులు యూనిఫైడ్ సైబర్ ఒలింపియాడ్‌లో మంచి ప్రతిభ కనబరిచారు. విద్యార్థులకు యూనిఫైడ్ సైబర్ వారి నుంచి బహుమతులు దక్కాయి. విద్యార్థులను విద్యాసంస్థల ఏజీఎం సుబ్బారెడ్డి అభినందించారు. పోటీ ప్రపంచంలో సైబర్ ఒలింపియాడ్ విశిష్టతను ఆయన వివరించారు. ఒలింపియాడ్‌లో పాల్గొన్న 67మందికి బహుమతులు దక్కాయన్నారు. ఇందులో 18 మంది జాతీయస్థాయి బహుమతులు పొందారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కరీముల్లా, డీన్‌లు ఈశ్వర్ రెడ్డి, గంగాధర్, చినబాబు, ప్రైమరీ ఇన్‌చార్జి వంశీప్రియ, యూసీఓ ఇన్‌చార్జిలు తారాదేవి, నాగార్జున పాల్గొన్నారు.

నిబంధనల మేరకు మద్యం షాపులు నడపాలి

చెన్నేకొత్తపల్లి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీకంటే అధికంగా మద్యం అమ్మకాలు జరపకూడదని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి గోవిందనాయక్ అన్నారు. సీకేపల్లిలోని ఎక్సైజ్ స్టేషన్ శుక్రవారం రాత్రి ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఎక్సైజ్ ఎస్‌ఐ శివప్రసాద్‌కు పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ మద్యం షాపులలో లైసెన్స్‌తోపాటు నియమనిబంధనల మేరకే నడపాలన్నారు. ఆయన వెంట జిల్లా స్క్వాడ్ సీఐ హరికృష్ణ ఉన్నారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

నార్పల, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండ్లపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఎస్‌టీయూ ఆధ్వర్యంలో మెటీరియల్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ పదిలో మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు.

వృద్ధాశ్రమానికి సోలార్ ప్యానెల్ వితరణ



సోలార్ ప్యానల్‌ను అందజేస్తున్న ఎస్‌బీఐ అధికారులు

అనంతపురంరూరల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని తపోవనం ఎస్‌బీఐ బ్యాంకు ఆధ్వర్యంలో నేషనల్ పార్కు వద్ద నున్న రాకేష్ ఎడ్యుకేషనల్ సొసైటీ, వృద్ధాశ్రమానికి రూ.2లక్షల 3కేవీ సోలార్ ప్యానెల్‌ను వితరణ చేశారు. శుక్రవారం వృద్ధాశ్రమం పైభాగంలో ప్యానల్‌ను ఏర్పాటు చేయించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అనంతపురం ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ రమేష్‌బాబు, చీఫ్‌మేనేజర్ శ్రీనివాస సందీప్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఎస్‌బీఐ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ఈ ఏడాది వృద్ధాశ్రమానికి సోలార్ ప్యానల్ అందించామన్నారు. హెచ్‌ఆర్ మేనేజర్ క్రిష్ణ, తపోవనం బ్రాంచ్ మేనేజర్ అనిల్‌కుమార్, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

అరగంటలోనే ముగించేశారు..

● మండల సమావేశం జరిపిన తీరుపై విస్మయం

చెన్నేకొత్తపల్లి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కరించడానికి ప్రతి మూడునెలలకొకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం జరిగిన తీరు పలువురిని విస్మయానికిగురిచేసింది. ఇలా వచ్చారు అలా వెళ్లారన్న రీతిలో కేవలం అరగంటలోనే సమావేశాన్ని మమ అనిపించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం తీరు. ఎంపీపీ అంజలి అధ్యక్షతన నిర్వహించిన సమావేశం గంట ఆలస్యంగా ప్రారంభమైంది. సమావేశానికి ప్రజాప్రతినిదులు, అధికారులు ప్రాధాన్యతను పక్కన పెట్టారు. ఎంపీపీ చాంబర్‌లో తమ బిల్లులకు సంబంధించి అధికారులతో చర్చించడానికే సమయాన్ని కేటాయించారు కానీ ప్రజలకు సంబంధించిన ప్రాధాన్యతా సమావేశాన్ని పూర్తిగా విస్మరించారనే విమర్శలు వినిపించాయి. 12గంటల సమయంలో ప్రారంభమైన సమావేశం అరగంటలోనే ముగిసింది. ఎంపీడీఓ శివశంకరప్ప, జడ్పీటీసీ గోవిందరెడ్డి, తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఈఓఆర్‌డీ అశోక్‌నాయక్ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం అర్బన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ రాష్ట్ర సంచాలకులు లావణ్యవేణిని సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. శుక్రవారం తాడేపల్లిలో ఆమెను అబ్దుల్ రజాక్, వెంకట సత్యనారాయణలతో కలిసి రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ పలు అంశాలను వివరించారు. సచివాలయ ఉద్యోగులకు ఉద్యోగోన్నతి, సర్వీస్ రూల్స్ మార్పునకు చర్యలు తీసుకోవాలని కోరారు. పింఛన్ల పంపిణీకి సంబంధించి సిబ్బందికి షోకాజు నోటీసులు జారీ చేయకుండా చూడాలన్నారు.

మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు ఈవెంట్స్

అనంతపురం క్రైం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని నీలం సంజీవరెడ్డి మైదానంలో శుక్రవారం మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ జగదీష్ పర్యవేక్షణలో నాలుగోరోజు పీఎంటీ, పీఈటీ పరీక్షలు కొనసాగాయి. ప్రత్యేకంగా మహిళా అధికారులు, సిబ్బందిని అధికంగా కేటాయించి అభ్యర్థులకు ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఫిజికల్ మెజర్‌మెంట్స్ అనంతరం ఈవెంట్స్ నిర్వహించారు. ఏఎస్పీలు రమణమూర్తి, ఇలియాజ్‌బాషా పాల్గొన్నారు.

కట్టారు... వదిలేశారు..!

● నిరుపయోగంగా గిడ్డంగులు
● ఇబ్బంది పడుతున్న రైతులు
● పట్టించుకోని అధికారులు



మరూరు టోల్‌గేటు వద్ద నిరుపయోగంగా ఉన్న గిడ్డంగి

రాప్తాడు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలను తాత్కాలికంగా నిల్వ చేసుకునేందుకు నిర్మించిన గిడ్డంగులను గాలికి వదిలేశారు. రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన గిడ్డంగులు నిరుపయోగంగా మారాయి. గత వైసీపీ ప్రభుత్వంలో నిర్మించిన గిడ్డంగులను ఇప్పటికీ ఉపయోగంలోకి రాలేదు. రైతులకు ధాన్యం నిల్వ చేసేందుకు నిర్మించిన గిడ్డంగులు అందుబాటులోకి తేవాలని వారు కోరుతున్నరు. పండించిన వేరుశనగ, కందులు, వరి, నూనె గింజలు, ఇతర పంటలు వర్షానికి తడవకుండా, దిగుబడిని విక్రయించే వరకు తాత్కాలికంగా ఇక్కడ నిల్వ ఉంచుకునేందుకు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో గిడ్డంగులను నిర్మాంచారు. మండలంలోని మరూరు గ్రామంలో టోల్‌గేటు వద్ద రెండేళ్ల క్రితం రూ.40 లక్షలతో 500 టన్నుల ధాన్యం నిల్వ చేసే సామర్థ్యంతో గిడ్డంగిని మార్కెటింగ్ శాఖ, మరూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో నిర్మించారు. అలాగే కొత్తపల్లిలో రూ.40 లక్షలు, రామగిరిలో రూ.40 లక్షలు ఆలమూరు, కందుకూరు, చియ్యేడు, గ్రామాల్లో గిడ్డంగులను నిర్మించారు. మార్కెటింగ్ శాఖ అధికారులు గిడ్డంగిని నిర్మిస్తారు. ఆ తరువాత ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధికారులు వాటిని ప్రారంభించి ఉపయోగంలోకి తీసుకురావాల్సి ఉంటుంది. రైతులు తాత్కాలికంగా అందులో ధాన్యం నిల్వ చేసుకున్నందుకు కొంత మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. అయితే గిడ్డంగులను ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధికారులు ప్రారంభించకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోడౌన్‌లు ఉపయోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు. .

ఉపయోగంలోకి తీసుకురావాలి



రాప్తాడు మండలంలోని మరూరు టోల్‌గేటు వద్ద నిర్మించిన గిడ్డంగి నిరుపయోగంగా ఉంది. వర్షాలు పడే సమయంలో రైతులు ధాన్యం నిల్వ చేసుకునేందుకు ఎంతో ఇబ్బంది పడుతున్నారు. గిడ్డంగిని ఉపయోగంలోకి తీసుకువస్తే రైతులకు ఎంతో ఉపయోగకరం.

\- సంగాలప్ప రైతు గొల్లపల్లి

వెంటనే ప్రారంభించాలి

రైతులు ధాన్యం నిల్వ చేసుకునేందుకు నియోజకవర్గంలో పలు చోట్లు నిర్మించిన గిడ్డంగులను వెంటనే ప్రారంభించారు. వాటిని రైతులకు ఉపయోగంలోకి తీసుకురావాలి.

\- రామకృష్ణ, సీపీఐ రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి

సావిత్రిబాయి పూలే ఆశయసాధనకు కృషి



మాట్లాడుతున్న డాక్టర్ బాలాకుమారి

అనంతపురం కల్చరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషిచేద్దామని గైనకాలజిస్టు బాలాకుమారి పిలుపునిచ్చారు. పూలే జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని ఎస్‌ఆర్ జూనియర్ కళాశాలలో సదస్సు నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రచయిత్రి శశికళ, కళాశాల ప్రిన్సిపాల్ భవాని, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సిద్ధు, ఓతూరు పరమేష్, భీమేష్, చంద్రిక, అశ్విని, సాయి, మీర, అజయ్ పాల్గొన్నారు.

జేవీవీ ఆధ్వర్యంలో: జన విజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో శుక్రవారం మొదటిరోడ్డులోని శారద నగరపాలకోన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. కార్యక్రమానికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి డాక్టర్ హేమలత ముఖ్యఅతిథిగా హాజరై పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఉపాధ్యాయులు రాధిక, శ్రీలత, నాగరత్నమ్మ, జేవీవీ నాయకులు రామిరెడ్డి, లక్ష్మీనారాయణ, తిరుపాలు పాల్గొన్నారు.

రామగిరి: మండలంలో సావిత్రిబాయి పూలే జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నసనకోట గురుకుల పాఠశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రమీల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆదర్శప్రాయురాలు సావిత్రిబాయి పూలే

అనంతపురం సెంట్రల్ : దేశంలో తొలి ఉపాధ్యాయురాలిగా అక్షర జ్యోతిని వెలుగించిన సావిత్రాబాయి పూలే విద్యాలోకానికి ఆదర్శప్రాయురాలని ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ వెంకటనాయుడు అన్నారు. శుక్రవార ఎస్కేయూ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర అధ్యక్షతన జయంతి వేడుకలు నిర్వహించారు. రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, సీఈ డాక్టర్ లోకేష్‌తోపాటు పలువురు బోధన, బోధనేతర సిబ్బంది హాజరై ఘన నివాళులర్పించారు. అలాగే బహుజన లాయర్స్ ఫోరం(బీఎల్‌ఎఫ్) ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలుర వసతి గృహం-2లో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర అధ్యక్షుడు నారాయణప్ప, అడ్వకేట్ ప్రమీల, వినోద్, గణేష్, వార్డన్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల నివాళి

అనంతపురం అర్బన్: సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆమె చిత్రపటానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, ఇతర నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తలారి ఆదినారాయణ, ముంటిమడుగు కేశవరెడ్డి, సరిపూటి రమణ, కృష్ణకుమార్, పోతుల లక్ష్మీనరసింహులు, శ్రీనివాసులు చౌదరి, స్వామిదాస్, నారాయణస్వామి యాదవ్, కురుబ నారాయణ స్వామి, రాంబాబు పాల్గొన్నారు.



సావిత్రిబాయి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

నార్పలలో ఉద్రిక్తత

● కాలువ పనుల కోసం ఇరువర్గాల వాగ్వాదం



కాలువ పనులను నిలిపివేయిస్తున్న పోలీసులు

నార్పల, జనవరి3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కూతలేరు బ్రిడ్జి వద్ద కాలువ నిర్మాణ పనుల కోసం శుక్రవారం టీడీపీకి చెందిన ఇరువర్గాలు వాగ్వాదానికి దిగాయి. దీంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. నార్పలలో కాలువ నిర్మాణపనులు తమ వర్గానికి ఎమ్మెల్యే చెప్పారని, కాదు తమ వర్గానికే చెప్పారని ఎక్స్‌కవేటర్లతో కాలువ పనులు చేపట్టారు. తీవ్రస్థాయిలో ఘర్షణ వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ కౌలుట్లయ్య స్పెషల్ పార్టీ పోలీసులతో ఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాల వారిని చెల్లాచెదురుచేశారు. డీఎస్పీ, సీఐలు అధికారులతో చర్చించి ఇరువర్గాలకు చెందిన ఎక్స్‌కవేటర్లను వెనక్కిపంపి పనులు నిలిపివేయించారు. ఎమ్మెల్యే బండారు శ్రావణి ఆదేశాల మేరకు ఎలాంటి గొడవలు లేకుండా కాలువ పనులు చేపట్టాలని ఇరువర్గాలకు చెందిన నాయకులకు డీఎస్పీ సూచించారు. దీంతో వారు శాంతించారు. అయితే ఇరువర్గాల నాయకుల ఇళ్ల వద్ద స్పెషల్ పార్టీ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

గార్లదిన్నె, జనవరి 3(ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల్ భవిష్యత్తు సాధ్యమవుతుందని ఎంపీటీసీ విశ్వనాథ్‌చౌదరి అన్నారు. మండలంలోని సంజీవపురం ఎంపీపీ పాఠశాలలో శుక్రవారం సొంత డబ్బులతో ఎంపీపీ విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు అందచేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయులు శేషు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనలో భాగస్వాములవుదాం



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు రాజ్యాంగ ప్రతిని అందజేస్తున్న రవిశంకర్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు చేపట్టిన సంక్షేమ పథకాలు, లక్ష్యాల సాధన, అమలులో భాగస్వాములవుతామని ఆలిండియా ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమసంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అన్నారు. ఏపీ రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన విజయానంద్‌ను శుక్రవారం రాజధాని అమరావతిలో రవిశంకర్ కలిశారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ రచించిన ఒరిజినల్ రాజ్యాంగ ప్రతిని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పాముల బెడదకు పరిష్కారం

అనంతపురం అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ చొరవతో స్థానిక 20వ డివిజన్‌లోని మోమిన్ కాలనీ వాసులకు పాముల బెడదకు పరిష్కారం లభించింది. పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు స్థానిక ప్రజలు అక్కడ పాతబడిన ఇంటి నుంచి పాములు వస్తుండటంతో ఇబ్బందిగా ఉందని వివరించారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే నగరపాలక సంస్థ అధికారులను సమస్య పరిష్కారించాలని ఆదేశించారు. శుక్రవారం పాతబడిన ఇంటిని నేలమట్టం చేసి, శిథిలాలను తొలగించారు.

టీడీపీ కార్యకర్త మృతికి ఎమ్మెల్యే సంతాపం: నగరంలోని 10వ డివిజన్ బూత్ ఇన్‌చార్జి శంకరమ్మ కుమారుడు టీడీపీ కార్యకర్త నాగేంద్ర మృతికి ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ సంతాపం వ్యక్తం చేశారు. నాగేంద్ర (33) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఫోన్ ద్వారా బాధిత కుటుంబ సభ్యులకు సంతాపం వ్యక్తం చేశారు.

రాజస్థాన్ సోదరుల మధ్య గొడవ

● జోక్యం చేసుకున్న స్థానికులు
● రెండు వర్గాలుగా మారి పరస్పరదాడులు
● ఫోర్త్‌టౌన్‌లో పలువురిపై కేసు నమోదు

అనంతపురం క్రైం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): నగరంలో శాంతిభద్రతలు ఉన్నాయా..? అని ఆందోళన చెందే పరిస్థితి నెలకొంది. గురువారం రాత్రి రెండు ప్రాంతాల్లో రెండు వర్గాలు ప్రధాన రహదారుల్లో కొట్టుకున్నాయి. ఈ ఘటన స్థానిక ప్రజల్లో బయాందోళనలు రేకెత్తించింది. రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు సోదరుల మధ్య స్థానికులు స్నేహితులుగా జోక్యం చేసుకున్నారు. అంతే రెండు వర్గాలు గొడవపడ్డాయి. తొలుత గురువారం సాయంత్రం 6.30గంటల సమయంలో ఖజానా జ్యువెలర్స్ పక్కన గొడవ పడ్డారు. అనంతరం ఆజాద్‌నగర్‌లో మరోసారి గొడవపడ్డారు. వీటిని చూస్తే శాంతిభద్రతలెక్కడున్నాయి..? పోలీసులు ఏం చేస్తున్నారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

ఏంటీ గొడవ..?: రాజస్థాన్ ప్రాంతానికి చెందిన మంగీలాల్, హేమారామ్ సోదరులు. 1985లో ఇక్కడకు వచ్చి వ్యాపారాలు చేసుకుంటున్నారు. వీరిలో మంగీలాల్ శ్రీకంఠం సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లే దారిలో ఎలక్ట్రికల్ షాప్ నిర్వహిస్తున్నాడు. హేమారామ్ బెంగళూరులో ఉంటుండగా కుమారుడు ఇక్కడే ఉంటున్నాడు. గత కొంతకాలంగా సోదరుల మధ్య ఆస్తి, డబ్బు విషయంలో వివాదం నెలకొంది. ఈ క్రమంలో గురువారం ఇద్దరూ స్థానికంగా స్నేహితులు, ఇతరులతో కలిసి రెండు వర్గాలై గొడవపడ్డారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ఖాజానా జ్యువెలరీ పక్కన ఒకరికొకరు కొట్టుకున్నారు. విఘ్నేశ్వర్‌రెడ్డిని అనే వ్యక్తిని కొట్టిన వీడియో వైరల్‌గా మారింది. అనంతరం ఆజాద్‌నగర్‌లో మరోసారి కొట్టుకున్నారు.



ఇరువర్గాలు గొడవపడుతున్న దృశ్యం

కేసు నమోదు: ఆజాద్‌నగర్‌లో జరిగిన గొడవపై నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ సాయినాథ్ తెలిపారు. జయప్రకాష్, బోయ రాము, సాయిలపై జరిగిన దాడి ఘటన ఫిర్యాదుపై భోగాతి విఘ్నేశ్వర్‌రెడ్డి, పెద్దపప్పూరు జడ్పీటీసీ రవి, రాము, హేమంత్ కుమార్‌రెడ్డి, రాజేష్, కొండారెడ్డి, మంగీలాల్, అతని కుమారుడుతో పాటు మరికొందరిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

ఏం జరిగింది..?

త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖజానా జ్యువెలర్స్ పక్కనే జరిగిన గొడవపై త్రీటౌన్ పోలీసులు తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరిస్తున్నారు. విఘ్నేశ్వర్‌రెడ్డి భార్య ప్రశాంతి తన భర్తపై దాడి జరిగిందని కేసు నమోదు చేయాలని కోరినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై త్రీటౌన్ సీఐ శాంతిలాల్ వివరణ కోరగా... గొడవా..? ఎక్కడబ్బా..? ఏం జరిగిందసలు అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దాడికి సంబంధించి వీడియో వైరల్ అవుతోందని చెబితే ఆ గొడవ ఆజాద్‌నగర్‌లో జరిగిందన్నారు. ఖజానా జ్యువెలరీ వద్ద మీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిందని చెబితే..అది తనకు తెలియదని చెప్పుకొచ్చారు.

రుణాలు చెల్లించండి: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలు గడువులోగా చెల్లించాలని ఎమ్మెల్యే పరిటాలసునీత సూచించారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో రామగిరి, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి మండలాల స్వయం సహాయక సంఘాల సభ్యులు అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కొన్నిచోట్ల రుణాలు చెల్లించక ఎమ్మెల్యే చెప్పారని అందుకే చెల్లించలేదని ప్రచారం చేస్తున్నారన్నారు. ఇలాంటి ప్రచారాలు నమ్మవద్దని ఆమె తెలిపారు. మూడుమండలాల్లో 3,300 స్వయం సహాయకసంఘాలుండగా ఇందులో ఏ గ్రేడ్ 1871, బీ గ్రేడ్ 945, సీ గ్రేడ్ 182 ఉన్నాయన్నారు. రుణాలు చెల్లించని గ్రూపులు సీ గ్రేడ్‌లోకి వెళ్లాయన్నారు. దీనివల్ల వారు నష్టపోతారని భవిష్యత్తులో రుణాలు వచ్చే అవకాశం లేదన్నారు. క్రమం తప్పకుండా చెల్లింపులుచేసి ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలన్నారు. ఏరియాకో ఆర్డీనేటర్ సత్యనారాయణ, నాయకులు రామ్మూర్తినాయుడు, పరంధామయాదవ్, సుధాకర్, ఏపీఎంలు వెంకటప్ప, నాగేంద్ర పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన టీడీపీ కార్యకర్త ఈడిగ వెంకటేశ్‌గౌడ్ గుండెపోటుతో మృతిచెందడంతో ఎమ్మెల్యే నాయకులతో కలిసి వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

సావిత్రిబాయి సేవలు అమూల్యం: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

బుక్కరాయసముద్రం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సావిత్రి బాయి పూలే సేవలు అమ్యూలమైనవని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం కొర్రపాడు అంబేడ్కర్ గురుకల బాలికల పాఠశాలలో సావిత్రిపూలే 194 జయంతిని పురస్కరించుకుని మిషన్‌శక్తి, కిశోరీ వికాసంలో భాగంగా బాలికల రక్షణ, నైపుణ్యాలు, వ్యక్తిగత అవగాహన తదితరర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కలెక్టర్‌తో పాటు ఆర్డీటీ డైరెక్టర్ విశాలా ఫెర్రర్ హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని రంగాలలో పురుషులతో సమానంగా మహిళలు పోటీ పడుతున్నారంటే అది సావిత్రిబాయి పూలే కృషి అన్నారు. ఆర్డీటీ డైరెక్టర్ మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాలలో ముందుండే విధంగా సూపర్ గర్ల్స్ స్వయం రక్షణ నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. ఐసీడీఎస్ ఏపీడీ వనాజా అక్కమ్మ, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూకొఠారి, ఇంటర్ ఆర్‌ఐ వెంకటరమణ, ఎస్సీ వెల్ఫేర్ జేడీ ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి, సీడీపీఓ శ్రీదేవి పాల్గొన్నారు.

కలెక్టర్‌కు టీడీపీ జిల్లా అధ్యక్షుడి శుభాకాంక్షలు



కలెక్టర్‌కు బొకే అందజేస్తున్న వెంకటశివుడు యాదవ్

అనంతపురం అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ వినోద్‌కుమార్‌కు టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

అక్బర్‌సాబ్ శుభాకాంక్షలు..



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అక్బర్

అనంతపురం టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టరు డాక్టరు వినోద్‌కుమార్‌ను కంటి వైద్యనిపుణులు డాక్టరు అక్బరుసాబ్ కలిశారు. నూతనసంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తను చేసిన సామాజికసేవలు గురించి కలెక్టరుకు వివరించారు.

జాతీయ రహదారి పనులు వేగవంతం చేయాలి: జేసీ



చక్రాయపేట వద్ద రహదారి పనులు పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

శింగనమల, జనవరి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్‌హెచ్ 544డి జాతీయ రహదారి పనులు వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ అధికారులకు సూచించారు. శుక్రవారం నియోజకవర్గంలోని కొర్రపాడు, శింగనమలక్రాస్, చక్రాయపేట, నాయనపల్లి క్రాస్‌లలో జరుగుతున్న పనులను జేసీ పరిశీలించారు. అలాగే చక్రాయపేట, ముచ్చుకోట వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జిలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ అధికారులు పనులను సకాలంలో పూర్తి చేయాలని, భూములు కోల్పోయిన వారికి పరిహారం ఇస్తున్నామన్నారు.

శ్మశాన స్థలాన్నీ ఆన్‌లైన్‌లో ఎక్కించేశారు..!

అనంతపురం రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): శ్మశాన స్థలాన్ని ఆన్‌లైన్‌లోకి ఎక్కించుకున్నారని, వాటిని పరిశీలించి తొలగించాలని ఇటుకలపల్లికి చెందిన గ్రామస్థులు తహసీల్దార్ మోహన్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం మండలంలోని ఇటుకపల్లి గ్రామంలో తహసీల్దార్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ రెవెన్యూ సమస్యలపై స్థానికులు, రైతులు ఫిర్యాదు చేశారు. మొత్తంగా 18 ఫిర్యాదులు వచ్చాయి. గ్రామ పరిధిలోని శ్మశానాన్ని, చెరువును కొంత మంది ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారు. వాటిని ఆన్‌లైన్‌లో తొలగించాలని కోరారు. సర్పంచు భాస్కర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అశోక్‌బాబు, వీఆర్వోలు పాల్గొన్నారు.

‘భద్రంగా మూలన’పై కలెక్టరు ఆరా

● ఆస్పత్రిలో హెచ్‌ఓడీలతో సూపరింటెండెంట్ సమావేశం
● యంత్రాల సమాచారం ఇవ్వకపోవడంపై అసంతృప్తి
● డిసెంబరులో వచ్చాయంటూ కలెక్టరుకు నివేదిక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పెద్దాసుపత్రిలో కోట్లు వి లువ చేసే యంత్రాలు మూలన పడేస్తున్నారని ‘భద్రంగా మూలకు’ అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. ఈకథనంపై శుక్రవారం కలెక్టరు వినోద్‌కుమార్ ఆరాతీసారు. యంత్రాలను ఎందుకు వినియోగించడంలేదు, మూలన పడేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు సీరియస్‌గా తీసుకొని అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ కలెక్టరు మల్లికార్జునరెడ్డి ఆర్‌ఎంఓలు, వివిధ విభాగాల హెచ్‌ఓడీలతో తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఆ సమయంలో ఏఏ విభాగాలకు ఏఏయంత్రాలు వచ్చాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొందరు వచ్చిన పరికరాల వివరాలు చెప్పడంతో ఈ సమాచారం కూడా చెప్పకపోతే ఎలా అని సూపరింటెండెంట్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు వైద్యవర్గాల ద్వారా సమాచారం. మరోసారి ఇలా చేయకూడదని వెంటనే వచ్చిన యంత్రాలను ఆయా విభాగాల్లో ఏర్పాటు చేయించి రోగులకు వైద్య సేవలు అందేలా చూడాలని ఆదేశించారు. మరోవైపు కలెక్టరు నివేదిక అడగడంతో గతనెల డిసెంబరులో ఈ యంత్రాలు వచ్చాయని త్వరతో టెక్నీషియన్లు వస్తారని వాటిని ఏర్పాటుచేయిస్తామని నివేదిక పంపినట్లు ఓ అధికారి తెలిపారు.

న్యూస్ బాక్స్

పోలీస్ స్టేషన్ తనిఖీ

బెళుగుప్ప, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రం లోని పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ శ్రీనివాసులు శుక్రవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సమస్యాత్మక గ్రామాలపై ఎప్పటికప్పుడు ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్‌ఐ శివకు, సిబ్బందికి సూచించారు. సీఐ చిన్నగౌస్, ఏఎస్‌ఐ రామదాసు సిబ్బంది పాల్గొన్నారు.

డీలర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

బెళుగుప్ప, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రా నికి చెందిన ఒకటో నంబర్ చౌకధాన్యపు డిపో డీలర్ నారాయణమ్మపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివ శుక్రవారం తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన తిప్పేస్వామి అనే వ్యక్తిని డీలర్ కులం పేరుతో దూషించారని, దీంతో ఫిర్యాదు చేయడంతో విచారించి కేసు నమోదు చేశామని ఎస్‌ఐ చెప్పారు.

ధాన్యం తరలింపులో జాప్యం

బొమ్మనహాళ్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వం అనుమతించిన మిల్లుల వద్దకు తరలించడంలో అధికారులు విఫలమవుతున్నారు. మండలంలోని ఉద్దేహాళ్, శ్రీధర ఘట్ట గ్రామాల్లో సొసైటీల ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. మొదట్లో ధాన్యం కొనుగోలు వేగంగా జరిగినా.. రెండు రోజులుగా ధాన్యం ఎగుమతిలో జాప్యం జరుగుతోంది. ప్రస్తుతం ఉద్దేహాళ్ సొసైటీ పరిధిలో 11 లారీలలో 3850 క్వింటాళ్ల ధాన్యం ఆగిపోయింది. ఇక శ్రీధరఘట్ట సొసైటీ పరిధిలో నాలుగు లారీలలో 1400 క్వింటాళ్ల ధాన్యం నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. ఆ రెండు గ్రామాల్లో రైతుల నుంచి కొనుగోలు చేసి ధాన్యం మొత్తం 15 లారీలలో సమకూరింది. మిల్లర్లు బ్యాంకు ష్యూరిటీ కారణంగా ధాన్యం ఎగుమతిలో ఆలస్యం కావడంతో లారీలు ఆగిపోయినట్లు తెలిసింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం బస్తాలు లోడు చేసి లారీలు ఇక్కడే ఆగిపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ధాన్యం త్వరగా ఎగుమతి చేయాలని రైతులు కోరుతున్నారు.

మోకాళ్లపై కార్మికుల నిరసన



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న కార్మికులు

గుత్తి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూలీలకు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని తెలిపారు. జీఓ 36ను తక్షణమే అమలు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్ జబ్బర్‌మీయాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మిక అధ్యక్షుడు రాజా, కార్యదర్శి రవిశంకర్, ఉపాధ్యక్షుడు మురళీ, నాయకులు పాల్గొన్నారు.

ఎంపీపీని విమర్శించే అర్హత లేదు

బెళుగుప్ప, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ మండల కన్వీనర్ మచ్చన్నకు ఎంపీపీ పెద్దన్నను విమర్శించే అర్హతలేదని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం నాయకులు శ్రీరంగాపురం తిప్పేస్వామి, దేవప్ప, ఎస్టీసెల్ నాయకుడు తిప్పేస్వామి, కోనంపల్లి శ్రీధర్, నాగరాజు విలేకరులతో మాట్లాడారు. వైసీపీ కన్వీనర్ మచ్చన్న ఇటీవల టీడీపీలోకి చేరిన ఎంపీపీ పెద్దన్నపై విమర్శలు చేస్తున్నారని, ఆయన్ను విమర్శించే ముందు మచ్చన్న ఆత్మవిమర్శ చేసుకోవాలని అన్నారు. మీ నాయకుడు విశ్వేశ్వరరెడ్డి సీపీఐ నుంచి కాంగ్రెస్‌లోకి, తర్వాత వైసీపీకి చేరలేదా అని ప్రశ్నించారు. ఫైనాన్స్, కార్పొరేషన్ రుణాలు ఎగురగొట్టి 420 కేసులో నిందితుడిగా ఉన్న మచ్చన్నకు ఇతరులను విమర్శించే అర్హత లేదని తెలిపారు.

పోలీసుల తీరు మారాలి

- గత ప్రభుత్వంలో మాదిరిగా చేస్తే కుదరదు
- జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీకాంత్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కదిరి శ్రీకాంత్‌రెడ్డి

తాడిపత్రి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పోలీసుల తీరు మారాలని, గత ప్రభుత్వంలో మాదిరిగా ఇప్పుడు కూడా చేయాలంటే కుదరదని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి శ్రీకాంత్‌రెడ్డి హెచ్చరించారు. పట్టణ సమీపంలోని ఆర్టీటీ కాలనీలో గల జనసేన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత సంవత్సరంలో ఓ చోరీకి సంబంధించి ఆధారాలతో సహా పోలీసులకు ఇచ్చినప్పటికీ.. ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. తప్పుచేసిన వారిపై చర్యలు తీసుకోవడానికి వారికి వచ్చిన నష్టం ఏమిటని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంటిలోకి అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డితో పాటు వారి అనుచరులు వెళ్లి టీడీపీ కార్యకర్తలపై దాడులు చేసిన విషయంలో నామమాత్రంగా కేసులు కట్టారన్నారు. ఎలక్షన్ సమయంలో కూడా పోలీసులు వైసీపీ వారికి సహకరించారని మండిపడ్డారు. పెద్దవడుగూరు మండలంలో జనసేన మండల నాయకుడు దూద్‌వలి స్థలాన్ని కొందరు వ్యక్తులు అక్రమ రిజిస్టర్ చేయించుకున్నారని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఒకరు మీద ఒకరు చెప్పుకుంటూ కేసును దాటవేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంపై డీఎస్పీ రామకృష్ణుడు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన ఇదిగో చూస్తాం.. అదిగో చూస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సమస్యపై ఫిర్యాదు చేస్తే కేసులు కట్టకుండా దాటవేయడం ఎంతవరకు సమంజసమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం మాదిరి కూటమి ప్రభుత్వంలో చేయాలంటే కుదరదని హెచ్చరించారు. మాకే ఇలా ఉంటే.. సామాన్యుల పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు న్యాయంగా చేసేవిధంగా ఉండాలన్నారు. తాడిపత్రి పోలీసుల పనితీరుపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, హోంమినిస్టర్ అనిత దృష్టికి తీసుకువెళతానని ఆయన పేర్కొన్నారు.

బాలికా విద్యను ప్రోత్సహించండి

- సావిత్రిబాయి జయంతి సభలో ప్రభుత్వ విప్ కాలవ



రాయదుర్గంలో నివాళులర్పిస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): బాలికా విద్యను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో శుక్రవారం జరిగిన సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాలికా విద్య కోసం సాయిత్రిబాయి పూలే నిరంతరం శ్రమించారన్నారు. బడుగు, బలహీన వర్గాలు బాగుండాలనే సంకల్పంతో సావిత్రిబాయిపూలే సత్యసోదక్ సమాన్ ఏర్పాటు చేశారన్నారు. బాలిక విద్య అంటే నచ్చని వారు ఆమె చదువు చెప్పడానికి వెళితే బురదవేయడం, రాళ్లువేసి అవమానించడం, దుర్భాషలాడటం చేసేవారని ఆందోళన వ్యక్తపరిచారు. అలాంటి ఎన్నో అవమానాలను ఆమె భరిస్తూ బాలికావిద్యను ఓ సామాజిక బాధ్యతగా తీసుకుని పాఠశాల ఏర్పాటు చేశారని చెప్పారు. ఓ ఆదర్శవంతమైన జీవితాన్ని ఆమె గడిపారన్నారని గుర్తు చేశారు. ఆమె స్ఫూర్తితో అందరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి



గుంతకల్లులో సావిత్రిబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐద్వామహిళలు

గుంతకల్లుటౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీఐటీయూ కాలనీలో శుక్రవారం ఐద్వా మహిళా సంఘం, డీవైఎఫ్ఐ నాయకులు సావిత్రిబాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఐద్వా మహిళా సంఘం పట్టణ అధ్యక్షురాలు జ్యోతి మాట్లాడుతూ.. బాలికల విద్య కోసం సావిత్రి బాయి చేసిన కృషి మరువలేనిదన్నారు. బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తెచ్చారని తెలిపారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేంద్ర, ఐద్వానాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక శంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల డైరెక్టర్ గోపాల్ , మహిళా విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రావణి, సభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక టెండర్‌రూట్స్ పాఠశాలలోనూ సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తల్లులకు పాదపూజ చేశారు. ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ: పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో సావిత్రి పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్‌యాదవ్, ప్రిన్సిపాల్ జ్ఞానప్రసన్న, వైస్‌ప్రిన్సిపాల్ జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: గుత్తిఆర్ఎస్‌లో ప్రభుత్వ పెన్షనర్ కార్యాలయంలో స్థానిక సామాజిక అభ్యుదయ వాదులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ పెన్షనర్స్ నాయకులు అబుబకర్, కుల్లాయిబాబు, సామాజిక అభ్యుదయ వాదులు రంగనాయకులు, వరదరాజులు, సువర్ణ, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి: మండలంలోని ఎస్‌కే చారిటబుల్ ట్రస్టు సమక్షంలో నడుస్తున్న విలువలబడి ఆధ్వర్యంలో బెస్తరపల్లి, మందలపల్లి, అపిలేపల్లి, మలయనూరు, ఎనుములదొడ్డి, రుద్రంపల్లి, తమ్మయ్యదొడ్డి, మలయనూరు, అల్లాపురం, కుందుర్పి, బండమీదపల్లి, కెంచంపల్లి, కొలిమిపాలెం గ్రామాల్లో ప్రజలు సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా జరుపుకున్నారు. విలువలబడి కోఆర్డినేటర్లు రఘువీర, శ్రీకాంత్, ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: పట్టణంలోని ప్రభుత్వ కేటీఎస్ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారిక విభాగం ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ రమణమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండలకేంద్రంలోని ఎంఈఓ కార్యాలయ ఆవరణంలో సావిత్రీబాయిపూలే జయంతిని నిర్వహించారు. సందర్భంగా మహిళా ఉపాధ్యాయులచేత కేక్‌కట్ చేయించారు. ఎంపీడీఓ నరసింహారెడ్డి , ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు వెంకటరెడ్డి , ప్రధానోపాధ్యాయులు సుధాకర్‌బాబు, మధుసూదన్‌రెడ్డి, హరినాథ తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో తెగుళ్లను నివారించవచ్చు

- జేడీఏ ఉమామహేశ్వరమ్మ

ఉరవకొండ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పంట మార్పిడితో తెగుళ్లను నివారించవచ్చునని జేడీఏ ఉమామహేశ్వరమ్మ రైతులకు సూచించారు. మండలంలోని మోపిడి గ్రామంలో గల వేరుశనగ, పప్పుశనగ పంటలను శుక్రవారం ఆమె పరిశీలించారు. వేరుశనగ పంటకు ఎర్ర గొంగళి, లద్దెపురుగు తెగులు ఉధృతంగా ఉందని, నివారణ కోసం క్వినాల్‌పాస్ 2 మి.లీలకు నీటిని కలిపి పిచికారీ చేయాలని అన్నారు. పప్పు శనగలో వేరుకుళ్లు,ఎండు తెగుళ్లు ఉన్నాయని, నివారణకు వేసవి దుక్కిలో ట్రైకో డర్మివిరిడిని, పశువుల ఎరువులో కలుపుకుని వేయాలని సూచించారు. అలాగే జొన్న పంటతో పంట మార్పిడి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆత్మ పీడీ మద్దిలేటి, ఏడీఏలు శైలజ, శ్రీనివాసులు, నారాయణనాయక్, ఏవో శుభకర్, ఏఈవో భరత్ పాల్గొన్నారు.

వారంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు

వచ్చే వారం నుంచి ఏపీ మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం కందుల కొనుగోలు చేయనున్నట్లు ఏవో శుభకర్ తెలిపారు. ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతులు మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రంలో అమ్మేందుకు పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

కణేకల్లు: మండల కేంద్రంలోని వ్యవసాయ ఉత్పనోత్పత్తి క్షేత్రంలో చేపడుతున్న పంట కోత ప్రయోగాలను వ్యవసాయశాఖ జేడీఏ ఉమామహేశ్వరమ్మ పరిశీలించారు. ఫారం పరిధిలో వరి పంటకు సంబంధించి ఏ ఏ వంగడాలను సాగుచేశారో.. ఎంతమేర దిగుబడి వచ్చిందో విషయాలను ఏడీఏ నారాయణనాయక్‌ను అడిగి తెలుసుకున్నారు.

కాలువ చివరి వరకు నీళ్లు వదులుతాం

యాడికి, జనవరి3(ఆంధ్రజ్యోతి): యాడికి కాలువ చివరి వరకు నీళ్లు పారేలా చర్యలు చేపడతామని హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్ తెలిపారు. యాడికి కాలువను శుక్రవారం ఆయన పరిశీలించారు. పదిరోజులక్రితం యాడికి కాలువకు నీటిని వదిలారు. ఈ నీళ్లు ఎంతవరకు పారాయని కాలువ వెంబడి పరిశీలించారు. పచ్చారుమేకలపల్లి గ్రామం వరకు కాలువకు నీరు వచ్చినట్లు తెలిపారు. పెద్దవడుగూరు మండలం కదరగుట్టపల్లి రెగ్యులేటరీ వద్ద నుంచి యాడికి కాలువకు వస్తున్న నీటిని పలు గ్రామాల రైతులు మధ్యమధ్యలో చెక్‌డ్యాంలకు మళ్లిస్తుండడంతో చివరి వరకు నీళ్లు పారడానికి ఆలస్యం అవుతున్నదని తెలిపారు. యాడికి కాలువ చివరి వరకు నీరు వచ్చేలా తగు చర్యలు చేపడతామని, రైతులు కూడాసహకరించాలని ఆయన తెలిపారు. కాలువను పరిశీలించిన వారిలో ఈఈ సలీంబాషా, డీఈ రెడ్డప్పరెడ్డి, జేఈలు చెన్నారెడ్డి, గోవిందప్ప, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు ఉన్నారు.

జ్యోతిబాయి కుటుంబానికి ఆర్థిక సాయం

బ్రహ్మసముద్రం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాయలప్పదొడ్డి గ్రామానికి చెందిన సుగాలి జ్యోతి బాయి ఆర్‌ఎంపీ వైద్యుడు వేసిన ఇంజక్షన్ వికటించి మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సూచన మేరకు టీడీపీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు శుక్రవారం గ్రామానికి వెళ్లి జ్యోతిబాయి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబానికి రూ. 25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు వన్నూరుస్వామి, క్లస్టర్ ఇన్‌చార్జి ఓబుళేసు, సంతే కొండాపురం సర్పంచ్ వనిత మల్లికార్జున పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

తాడిపత్రి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొందలదిన్నె గ్రామానికి చెందిన బుగ్గరామయ్యను అరెస్ట్‌చేసి అతడివద్ద నుంచి 15మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని శుక్రవారం రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు దాడులు చేశామని, దీంతో బుగ్గరాయమయ్య ఇంటివద్ద ఎలాంటి అనుమతులు లేకుండా మద్యంబాటిళ్లను విక్రయిస్తుండడంతో ఆయన్ను అరెస్ట్ చేసి కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

ఆర్‌ఎంపీ క్లినిక్ సీజ్

గుమ్మఘట్ట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపసముద్రం గ్రామంలో ఆర్‌ఎంపీ వైద్యుడు చిరంజీవి నిర్వహిస్తున్న క్లినిక్‌ను డీఎంహెచ్ఓ భ్రమరాంబిక, డీపీఎంఓ రవిశంకర్, గుమ్మఘట్ట వైద్యాధికారి రమేష్ శుక్రవారం సీజ్ చేశారు. గత రెండు రోజుల క్రితం బ్రహ్మసముద్రం మండలం రాయలదొడ్డి గ్రామానికి చెందిన గిరిజన మహిళ జ్యోతిబాయికు ఆర్‌ఎంపీ వైద్యుడు చేసిన వైద్య వికటించింది. దీంతో జిల్లా అధికారులు స్పందించి ఆ ఆర్‌ఎంపీ వైద్యుడి క్లినిక్‌ను సీజ్ చేశారు.

రీసర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

బొమ్మనహాళ్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న భూసర్వేతో గ్రామాల్లో ఎన్నో దశాబ్దాల నుంచి ఉన్న భూ సమస్యలు పరిష్కారమవుతాయని, రైతులు దగ్గరుండి భూములను సర్వే చేయించుకోవాలని తహసీల్దార్ మునివేలు తెలిపారు. మండలంలోని కురవళ్లి గ్రామంలో రీసర్వే ప్రాజెక్టుపై రైతులకు అవగాహన కల్పించేందుకు గాను శుక్రవారం ఆయన రెవెన్యూ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కురవళ్లిలో రైతులకు భూ సమస్యలు అధికంగా ఉన్నాయని, వాటి పరిష్కారానికి ఈ భూసర్వే ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. రైతులందరూ సర్వే టీంలు, కొలతలు వేసే రోజు పొలాలకు వెళ్లి తమ వద్ద ఉన్న పట్టాదారుపాసుపుస్తకాలు, లింక్ డాక్యుమెంట్లు, రిజిస్ట్రేషన్‌స్టాంపులు అధికారులకు చూపించాలని తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ రవితేజ, వీఆర్వో రవి, టీడీపీ పాల్గొన్నారు.

నియామకం..

గుంతకల్లుటౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు న్యూటౌన్ బీజేపీ అధ్యక్షుడిగా వాసం రవిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ మండల ఎన్నికల అధికారి నియమాక పత్రాన్ని అందజేసినట్లు శుక్రవారం ఆయన ప్రకటనలో తెలిపారు. తనను న్యూటౌన్ అధ్యక్షుడిగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరికి, జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డిశ్రీనివాసులుకు, ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్‌కు, ఉపాధ్యక్షుడు కొలమి రామాంజనేయులుకు కృతజ్ఞతలు తెలిపారు.

బాల్య వివాహాలను అరికడదాం: ఆర్డీఓ వసంత్‌బాబు



కళ్యాణదుర్గంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్డీవో, డీఎస్పీ, మున్సిపల్ కమిషనర్

కళ్యాణదుర్గం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆర్డీఓ వసంత్‌బాబు సూచించారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో శుక్రవారం కిశోర వికాసం మండల స్థాయి శిక్షణను సీడీపీవో లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్డీఓతో పాటు డీఎస్పీ రవిబాబు, మున్సిపల్ కమిషనర్ వంశీ కృష్ణ భార్గవ్, వైద్య సిబ్బంది, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు జరుగుతాయన్నారు. వాటి వల్ల బాలికల జీవితం నాశనమవుతుందని తెలిపారు. కనుక ఎవరూ బాల్యవివాహాలను ప్రోత్సహించరాదని సూచించారు. వాటిని నివారించడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని అన్నారు. అప్పుడే బాల్యవివాహాలను అరికట్టడం సాధ్యమవుతుందన్నారు. అనంతరం బాల్య వివాహాలను అరికడదామంటూ అందరూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కిశోరవికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. నార్పల సీడీపీఓ శ్రీదేవి మాట్లాడుతూ ముందుగా డ్రాపౌట్ బాలికలను గుర్తించాలన్నారు. గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్, మహిళా పోలీసు, గ్రామ పంచాయతీ సెక్రెటరీ, వీఆర్వోలు కలిసి పని చేయాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సూపర్‌వైజర్ రోజామని, ఏఎస్‌ఐ శ్రీనివాసగౌడ్, అంగన్‌వాడీటీచర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో కిశోర వికాసంపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియా, సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. అప్పుడే ఉన్నత లక్ష్యాలను చేరుకుంటారన్నారు. సమాజంలో బాలుల హక్కుల పరిరక్షణలో అందరూ భాగస్వాములు అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ డిల్లీశ్వరి, ప్రభుత్వాఆసుపత్రి వైద్యురాలు రమ్యతేజ, సూపర్‌వైజర్ నాగేశ్వరి, శిక్షకులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: స్థానిక పాతగుంతకల్లులోని వాల్మీకి కల్యాణ మండపంలో కిశోర వికాసంపై మండల స్థాయి కమిటీ సభ్యులకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్ట్ అధికారి మోహన్, ఐసీడీఎస్ డీసీపీఓ డిల్లీశ్వరి, ఈఓఆర్డీ నాగభూషణం, ఏపీఎం గుణశ్యామ్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పిల్లలను తప్పక బడికి పంపాలని సూచించారు. బాలికలకు బాల్యవివాహాల చేయడం మానుకోవాలన్నారు.

రాయదుర్గం రూరల్: పట్టణ సమీపంలోని డ్వామా కార్యాలయంలో కిశోర వికాసంపై మండలస్థాయి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి మాట్లాడుతూ ఎదిగే ఆడపిల్లలకు రక్షణ కల్పించేబాధ్యత అందరిపై ఉందన్నారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వెలుగు సీసీ గోవిందప్ప, ఆరోగ్య విద్యాబోధకుడు కెంచె లక్ష్మీనారాయణ, ఆవులదట్ల పీహెచ్‌సీ వైద్యుడు రాజేంద్రప్రసాద్, హెల్త్,అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో అర్జీల వెల్లువ

విడపనకల్లు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకలగురికిలో శుక్రవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఇందులో తహసీల్దార్ సునితాబాయికి పలువురు రైతులు వివిధ భూ సమస్యల పరిష్కారం కోరుతూ అర్జీలు ఇచ్చారు. అలాగే మరో ఎనిమిది మంది రైతులు మాట్లాడుతూ.. స్థానిక ఆంజనేయ స్వామి ఆలయ భూమికి ఇవ్వాల్సిన కౌలును వైసీపీ మద్దతుదారులు అయిన అర్చకులు జీర్ల నాగరాజు, జీర్ల శివకోటికి ఇవ్వాలట అని, ఇదెక్కడి అన్యాయమని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. న్యాయం చేయాలని కోరారు.

43-10 ప్రకారం అర్చకులకే హక్కులు

43-10 జీఓ ప్రకారం రూ. 5లక్షల్లోపు ఆదాయం ఉన్న దేవాలయ భూములపై ఆ ఆలయ అర్చకులకే సర్వహక్కులు అంటూ మాజీ సీఎం జగన్ ఇచ్చిన జీఓను అడ్డు పెట్టుకుని గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయ భూమిని వైసీపీ మద్దతుదారులైన అర్చకులు జీర్ల నాగరాజు, జీర్ల శివకోటి తమ పేరిట చేయించుకున్నట్లు సమాచారం. అనుభవ దారులు గా రికార్డుల్లో వారి పేర్లను రెవెన్యూ అధికారులు సైతం రికార్డుల్లోకి ఎక్కించారు. దీంతో ఆ ఆలయ భూమి 18.24ఎకరాలు అర్చకులదేనని, వారికే కౌలు చెల్లించాలని దేవాదాయ శాఖ అధికారులు సెలవిచ్చారు. దీంతో 40 ఏళ్లుగా సాగు చేసకుంటున్న ఎస్సీ , బీసీ రైతులకు పూర్తిగా అన్యాయం జరగినట్లే.

ఆలయాల అభివృద్ధే లక్ష్యం: జేసీపీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్ రెడ్డి

పెద్దపప్పూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధే తన లక్ష్యమని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అశ్వర్థ నారాయణస్వామి ఆలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. అక్కడ ఇటీవల ప్రారంభించిన ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆలయాల అభివృద్ధికి తాను కృషి చేస్తానన్నారు. రాబోయే ఫిబ్రవరిలో అశ్వర్థనారాయణస్వామి తిరుణాలను అంగరంగవైభవంగా నిర్వహించాలని ఆలయ సిబ్బందికి తెలియజేశారు. ఆలయ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. ఆలయ సమీపాన చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనుల్ని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట నియోజకవర్గ టీడీపీ నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షుడు తాతిరెడ్డి లోకనాథ్‌రెడ్డి, నాయకులు బీసీ రామకృష్ణారెడ్డి, జేసీ శశిధర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, పవన్‌కుమార్ రెడ్డి, మండల కన్వీనర్ గుర్తి రఘునాయుడు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

జగనన్న లేఅవుట్లపై విజిలెన్స్ విచారణ

ఉరవకొండ,జనవరి3 (ఆంధ్రజ్యోతి): జగనన్న లేఅవుట్లపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన ఈ కాలనీల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించిన విషయం తెల్సిందే. దీంతో పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో భూముల కొనుగోళ్లకు సంబంధించిన రికార్డ్‌లను విజిలెన్స్ సీఐలు శ్రీనివాసులు జమాల్ బాషా, వాసుప్రకాష్‌లు పరిశీలించారు. ఎవరైనా భూమి అమ్మినట్లయితే యజమానుల ఖాతాల్లోకి నగదు జమ అయిందా అని ఆరా తీశారు.

విడపనకల్లు: మండలంలోని హావళిగి, కరకముక్కల, గ్రామాల్లో జగనన్న కాలనీల కోసం అప్పట్లో ప్రభుత్వం కొనుగోలు చేసిన భూములను వాటి వివరాలపై విజిలెన్స్ అధికారులు విచారించారు. భూమి ఇవ్వాలని ఎవ్వరైనా బెదిరించటంగాని, భయపెట్టటంగాని చేశారా అంటూ అడిగి తెలుకున్నారు. అనంతరం హావళిగి గ్రామం చేరుకుని అక్కడ జగనన్న కాలనికి చెందిన రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో విజిలెన్స్ సీఐలు శ్రీనివాసులు, జాఫర్‌బాషా, ఏఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలకు అండగా ఉంటా: ఎమ్మెల్యే



మైనార్టీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు

కళ్యాణదుర్గం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మైనార్టీలకు అండగా నిలుస్తానని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు భరోసా ఇచ్చారు. పట్టణంలోని బిలాల్ మసీదులో నిర్మించిన కమ్యూనిటీ మరుగుదొడ్లను శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా వెళ్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో తనయుడు అమిలినేని యశ్వంత్ చౌదరి బిలాల్ మసీదులో కమ్యూనిటీ మరుగుదొట్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని నెరవేర్చామని తెలిపారు. మైనార్టీలకు తాము ఎల్లప్పుడూ అండగా వుంటూ అన్ని విధాలా ఆదుకుంటామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేకు పలువురు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే స్థానిక టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డీఎస్ మూర్తి నివాసంలో ఏర్పాటు చేసిన అయ్యప్ప పడి పూజకు ఎమ్మెల్యే హాజరయ్యారు.

సిబ్బంది లేక సచివాలయం ఖాళీ



ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న శెట్టూరులోని సచివాలయం

శెట్టూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సచివాలయానికి ఏ ఒక్క సిబ్బంది శుక్రవారం హాజరు కాలేదు. సచివాలయం ఖాళీగా దర్శనమిచ్చింది. ఉదయం 11 గంటలు అయినా ఏ ఒక్కరూ కూడా కార్యాలయంలో కనిపించలేదు. మండల స్థాయి అధికారులు సచివాలయాలను తనిఖీ చేయకపోవడంతో సిబ్బంది విధులకు సరిగా హాజరు కావడం లేదనే విమర్శలు వినవస్తున్నాయి. మండల కేంద్రంలోని సచివాలయం పరిస్థితే ఇలా వుంటే గ్రామాల్లోని సచివాలయాలు పని తీరు ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఆయా గ్రామాల్లో సత్వర సేవల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయానికి సిబ్బంది హాజరు కాకపోతే ఎలా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి సచివాలయానికి సిబ్బంది రెగ్యులర్‌గా హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

ఏఓ రామ్‌ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలి

గుంతకల్లుటౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రామ్‌ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ గుంతకల్లు డివిజన్ కార్యదర్శి సురేష్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్‌రవికుమార్‌ను అనంతపురంలో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ .. ఏఓ రామ్‌ప్రసాద్ ఆసుపత్రిలో వైద్యులు, సెక్యూరిటీ గార్డులు, శానిటేషన్ సిబ్బందిని వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. ఆస్పత్రిలో జరిగిన పనులకు బిల్లుల్లో కమిషన్లు డిమాండ్ చేస్తున్నారన్నారు. గత డిసెంబరు 28 అతడిపై విచారణ చేశారని, అయితే ఏమి చర్యలు తీసుకున్నారో తెలియడం లేదని అన్నారు. వెంటనే అతడిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, ఓబులు, రాజు, సాంబ, జావీద్ పాల్గొన్నారు.